దారుణం!

- బాలబాలికలపై వృద్ధుడి లైంగిక చర్యలు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసు విచారణ
- పోక్సో కేసు.. పోలీసుల అదుపులో నిందితుడు
- అతడికి హెచ్ఐవీ ఉండడంతో ఆందోళన
- తొమ్మిది మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

7

వయసు 33.. కేసులు 69

- 16 ఏళ్ల నుంచే చోరీలు
- అంతర్ జిల్లా దొంగ ఆట కట్టించిన పోలీసులు

7

పాస్టర్ ప్రవీణ్ మృతిపై కొనసాగుతున్న దర్యాప్తు : ఎస్పీ

7



పల్లె నుంచి.. పదవుల పల్లకీలోకి..

- తెలుగుదేశంలోనే రాజకీయ అరంగేట్రం
- తొలిసారే ఎమ్మెల్యే.. మంత్రి కూడా..
- 42 ఏళ్లు ఒకే పార్టీ.. ఒకటే జెండా
- ఏవీ నగరానికి కీర్తికిరీటం యనమల
- నేడు తునిలో రాజకీయ ప్రస్థాన సభ
- పుస్తకావిష్కరణ.. ఫొటో గ్యాలరీ ఏర్పాటు

6



అర్ధరాత్రి అలజడి!

- బాణసంచా కాల్పుల్లో విస్ఫోటనం
- భయంతో రోడ్లపైకి వచ్చిన ప్రజలు
- రామచంద్రపురంలో ప్రకంపనలు
- పగిలిన వాణిజ్య భవనాల అద్దాలు
- రూ.18.20 లక్షల ఆస్తి నష్టం

7

రుణం.. రణం!





ఇటీవల బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు

- ప్రజాప్రతినిధులకు 'సవాల్'గా మారిన కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక
- ఉమ్మడి జిల్లాలో బీసీ, కాపు కార్పొరేషన్లకు 7,303 యూనిట్లు మంజూరు
- అందిన దరఖాస్తులు 1,11,038.. అర్హత సాధించిన వారు స్వల్పమే
- లబ్ధిదారులకు షాక్ ఇస్తున్న బ్యాంకులు.. రుణాల కోసం ఎమ్మెల్యేలపై ఒత్తిడి
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దరఖాస్తుదారులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ సామాజికవర్గాల వారికి రుణాల పంపిణీ కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్లకంటే 15 రెట్లు అధికంగా దరఖాస్తులు పోటెత్తాయి. దాంతో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికార యంత్రాంగం అష్ట కష్టాలు పడుతోంది. మరోవైపు దరఖాస్తుదారుల ఒత్తిడితో అర్హులైన లబ్ధిదారులను సిఫారసు చేసేందుకు ఎమ్మెల్యేలు సైతం ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో బీసీ, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్ కింద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ కార్పొరేషన్లకు సంబంధించి 7,303 యూనిట్లు మంజూరు కాగా వాటికోసం 15 రెట్లు అధికంగా అంటే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లక్షా 11వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిని ఆయా పట్టణాలు, కార్పొరేషన్లు, మండలాల వారీగా ఇటీవల అధికారులు ఇంటర్వ్యూలకు పిలిచి రుణాలకు అర్హులైన లబ్ధిదారుల అన్వేషణలో పడ్డారు. ఈ దశలోనే రాజకీయ ఒత్తిళ్లతో రుణాలు తమకే మంజూరు చేయాలంటూ పట్టణ, మండల స్థాయి ప్రజాప్రతినిధుల ద్వారా అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, మరికొందరైతే మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సుల పేరుతో రుణ మంజూరు కోసం పైరవీలు చేస్తున్నారు. ఈ పరిణామాలు ప్రస్తుతం కూటమి ప్రజాప్రతినిధులకు ప్రాణసంకటంగా మారింది. ఎవరిని నొప్పించినా రానున్న రోజుల్లో పరిస్థితులు ఇబ్బందికరంగా మారుతాయనే ఆందోళన వారిలో కనిపిస్తోంది.

దరఖాస్తుదారులు 15 రెట్లు అధికం..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో 7,303 యూనిట్లకుగాను మొత్తం 1,11,038 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో బీసీ కార్పొరేషన్ ద్వారా 63,412 మంది. కాపు కార్పొరేషన్ల ద్వారా 45,290, ఈడబ్ల్యుఎస్ కింద 2336 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వాటన్నింటినీ ఆయా కార్పొరేషన్‌కు చెందిన అధికారులు విశ్లేషించి అభ్యర్థులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాటిలో భాగంగా బీసీ కార్పొరేషన్ రుణాల కోసం కాకినాడ జిల్లాలో 1,895 యూనిట్లకోసం 31,856 మంది దరఖాస్తు చేశారు. వారిలో ఆయా మండలాలకు చెందిన అధికారులు 777 మందిని ఎంపిక చేయగా 245 మందికి రుణాలు ఇచ్చేందుకు ప్రస్తుతం బ్యాంకర్లు అంగీకరించారు. అదే విధంగా కాపు కార్పొరేషన్ కోసం 775 యూనిట్ల కోసం 21,455 మంది దరఖాస్తు చేయగా వారిలో 390 మందిని అధికారులు ఎంపిక చేశారు. 106 మందికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారు. అదేవిధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బీసీ కార్పొరేషన్‌కు 1,366 రుణాలు లక్ష్యం కాగా 15,148 మంది దరఖాస్తు చేశారు. వారిలో మండలస్థాయిలో అధికారులు 399 మందిని ఎంపిక చేయగా కేవలం 22 మంది లబ్ధిదారులకు మాత్రమే రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించాయి. అదేవిధంగా కాపు కార్పొరేషన్ ద్వారా 756 యూనిట్ల లక్ష్యం కాగా 15,643 మంది దరఖాస్తు చేశారు. మండలస్థాయి అధికారులు ఇప్పటివరకు 343 మందిని ఎంపిక చేశారు. కేవలం 16 మందికే బ్యాంకులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. తూర్పుగోదావరికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా 1,341 యూనిట్లు లక్ష్యంగా కాగా ఇందుకోసం 16,408 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో అధికారులు 243 మందిని ఎంపిక చేయగా బ్యాంకులు మాత్రం 23 మంది లబ్ధిదారులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. కాపు కార్పొరేషన్ ద్వారా 758 యూనిట్ల లక్ష్యం కాగా 8,192 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వీరిలో 174 మందిని అధికారులు ఎంపిక చేయగా కేవలం తొమ్మిది మందికి మాత్రమే ఇప్పటికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించాయి.

ఎమ్మెల్యేలకు శిరోభారం..

బీసీ, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్ రుణాలకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలపై తీవ్ర ఒత్తిడి ప్రారంభమైంది. తమ వారికే రుణాలు మంజూరుచేసేలా సిఫార్సులు చేయాలంటూ లబ్ధిదారులను వెంటేసుకుని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు వారి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నాయని, మేము పెట్టుకున్న లోన్లు మంజూరు చేయకపోతే గ్రామాల్లో పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాల్సి వస్తుందంటూ కొందరు పరోక్ష హెచ్చరికలు చేస్తున్నారు. అయితే రుణాల మంజూరులో గానీ, లబ్ధిదారుల ఎంపికలో గానీ తమ ప్రమేయం ఏమీ ఉండదని, అభ్యర్థుల అర్హతలు, వారు పెట్టుకునే వ్యాపారాలకు సంబంధించి యూనిట్లు, బ్యాంకుల్లో వారికి ఉన్న సిబిల్ స్కోర్ వంటి వాటిని పరిగణలోకి తీసుకుని కార్పొరేషన్ అధికారులు రుణాలు మంజూరు చేస్తారని ప్రజాప్రతినిధులు నచ్చచెబుతున్నారు. ఇక దరఖాస్తుల సమయంలో ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా ఇప్పుడు వార్డుకు ఒకటి, గ్రామానికి ఒకటి లోన్లు ఇస్తే ఎలాగంటూ నేతలు తలలుపట్టుకుంటున్నారు.

బీసీ రుణాలు.. సబ్సిడీలు..

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

బీసీలకు ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంక్ రుణాలతో ఈ సహాయం అందుతుంది. యూనిట్ విలువ రూ.2 లక్షల వరకూ ఉంటే సబ్సిడీ 50 శాతం లేదా, రూ.75 వేలు మించకుండా ఉంటుంది. యూనిట్ కాస్ట్ రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకూ ఉంటే 50 శాతం లేదా, రూ. 1,25,000వరకూ సబ్సిడీ ఉంటుంది. రూ.3 లక్షల నుంచి 5లక్షల వరకూ యూనిట్ విలువ ఉంటే, సబ్సిడీ రూ.2 లక్షల వరకూ ఉంటుంది. జనరిక్ మెడికల్ షాపులకు కూడా రుణాలు ఇస్తున్నారు. రూ.8 లక్షల విలువ ఉంటే రూ.4 లక్షలు సబ్సిడీ లభిస్తోంది. మేదర, కుమ్మర శాలివాహన వారికి బుట్టల అల్లకం, కుండల తయారీకి రుణమిస్తారు. యూనిట్ కాస్ట్ రూ.3 లక్షలుంటే రూ.1.5 లక్షల సబ్సిడీ ఉంటుంది. మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజస్ పథకం కింద రూ.25 లక్షల వరకూ యూనిట్ విలువ ఉంటుంది. ఇందులో రూ.10 లక్షలు సబ్సిడీ, రూ.10 లక్షలు బ్యాంక్ రుణం, రూ.5 లక్షలు లబ్ధిదారుడి వాటా.

ఆదాయం డీలా..

- లక్ష్యం రూ.701కోట్లు.. రాబడి రూ.472 కోట్లు
- రూ.299 కోట్లు తగ్గుదల
- డాక్యుమెంట్ల సంఖ్యలోనూ తగ్గుదల



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గడిచిన ఆర్థిక సంవత్సరం రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం జిల్లాలో లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. అంతకు ముందు ఏడాదితో పోల్చినా తక్కువగానే రాబడి సమకూరింది. వాస్తవానికి గత ఏడాది నవంబరు నుంచీ రిజిస్ట్రేషన్లు నెమ్మదిస్తూ వచ్చాయి. అయినప్పటికీ సరైన దిద్దుబాటు చర్యలు కొరవడడం, మరోవైపు రియల్ ఎస్టేట్ పడకేయడం వెరసి రిజిస్ట్రేషన్ల ఆదాయం లక్ష్యానికి 32 శాతం దూరంలో ఆగిపోయింది. జిల్లాలో రిజిస్ట్రేషన్ల ఆదాయంలో ముందు వరుసలో ఉండే రాజమహేంద్రవరం, రాజానగరం, కడియం, పిడింగొయ్యి కూడా నిరాశపరచగా అనంతపల్లి కాస్త మెరుగ్గా 92శాతం టార్గెట్ పూర్తిచేసింది.

రాబడికి గండి

తొలుత 2023-24 ఆర్థిక ఏడాదితో పోలిస్తే 2024-25 ఆదాయం కాస్త మెరుగైనా లక్ష్యానికి మాత్రం చాలా దూరంలోనే ఉంది. అనంతపల్లి మినహా ఏ రిజిస్ట్రారు కార్యాలయమూ 80 శాతానికి చేరువకాలేదు. ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో మాత్రం డాక్యుమెంట్ల సంఖ్యలోనూ అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే భారీగా తగ్గుదల నమోదైంది. 2023-24, 2024-25కి ఏకంగా లక్ష డాక్యుమెంట్లు తగ్గాయి. 2024-25కి వచ్చేసరికి రూ.701కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా కేవలం రూ.472కోట్లు మాత్రమే ఖజానాకు చేరింది. రూ.229 కోట్లు ఆదాయంలో కోతపడింది. జిల్లాలో అధిక ఆదాయం ఆర్జించే రాజమహేంద్రవరం లక్ష్యానికి రూ.73 కోట్లు దూరంగా ఆగిపోయింది. వేగేశ్వరపురం 50శాతం కూడా చేరుకోలేదు. రిజిస్ట్రేషన్ల ఆదాయం బాగా పడిపోతోందని గతంలోనే 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించడం గమనార్హం. 2023-24 ఏడాది ఎన్నికల సంవత్సరం. వైసీపీ ప్రభుత్వ హయాంలో భూముల పందేరం యథేచ్ఛగా జరిగిన సంగతి తెలిసిందే. వేల ఎకరాల్లో చుక్కల భూములను ఫ్రీహోల్డు చేశారు. వాటిలో చాలా మటుకు వైసీపీ నాయకులే రిజిస్ట్రేషను చేయించుకున్నారని తెలుస్తోంది. చివరి ఏడాది మరీ దారుణంగా భూములపై కోరలు చాచడంతో రిజిస్ట్రేషను శాఖకు బాగా ఆదాయం సమకూరినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఏడాది 78.38 శాతం టార్గెట్ పూర్తి చేసింది.



● ఇవీ లెక్కలు

ఎస్ఆర్వో	2023-24 (రూ.కోట్లలో)			2024-25 (రూ.కోట్లలో)		
	లక్ష్యం	రాబడి	డాక్యుమెంట్లు	లక్ష్యం	రాబడి	డాక్యుమెంట్లు
అనపర్తి	20.56	16.05	8302	23.19	17.48	4640
అనంతపల్లి	27.58	20.20	12650	31.66	29.20	9370
బిక్కవోలు	28.07	15.47	12221	26.44	20.63	5692
కడియం	57.44	36.29	14593	59.55	38.46	7929
కోరుకొండ	25.82	19.95	15671	32.03	16.87	6612
కొవ్వూరు	47.72	37.89	22170	57.59	43.54	11954
నిడదవోలు	38.55	28.18	18562	44.88	30.14	9526
పిడింగొయ్యి	70.89	45.59	10905	71.65	51.09	5853
రాజమండ్రి	150.78	149.44	29196	230.34	157.20	17513
రాజానగరం	89.56	67.83	19334	94.21	51.48	10963
సీతానగరం	9.90	6.78	6546	9.82	7.17	3060
వేగేశ్వరపురం	16.46	13.39	9386	20.03	9.45	4579
మొత్తం	583.13	457.06	179536	701.39	472.71	97691

జిల్లాకు 50 ఎలక్ట్రిక్ బస్సులు

రాజమహేంద్రవరం డిపోకి కేటాయింపు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పీఎం ఈ-బస్ సేవా కింద కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించనున్న 750ఎలక్ట్రిక్ బస్సుల్లో జిల్లా ఆర్టీసీకి 50 బస్సులు రానున్నాయని తెలుస్తోంది. ఈమేరకు దీనికి సంబంధించిన సమాచారం ఇప్పటికే ఆర్టీసీ జిల్లా అధికారులకు అందినట్టు తెలిసింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు టెండరు దశలో ఉంది. ఎలక్ట్రిక్ బస్సులకు ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుకోవడం, సాంకేతికతలను సమకూర్చుకోవాల్సి ఉన్నందున ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డు ఎక్కేందుకు మరో పది నెలల నుంచి ఏడాది సమయం పడుతుందని చెబుతున్నారు. తొలిదశలో భాగంగా జిల్లాకు కేటాయించే 50 ఎలక్ట్రిక్ బస్సులను రాజమహేంద్రవరం డిపో నుంచే ఆపరేట్ చేస్తారు. వీటిని ప్రధాన రూట్లలో విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ మార్గాల్లో నడపాలని ఆర్టీసీ అధికారులు ఇప్పటికే అంచనాకు వచ్చారు. వాతావరణంలో కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో కేంద్రం ఈ-బస్ సేవా ప్రోగ్రాంను అమలు చేస్తున్న నేపథ్యంలో దశలవారీగా ఇతర డిపోల్లోనూ ఎలక్ట్రిక్ బస్సులను పెద్ద సంఖ్యలో అందుబాటులోకి తీసుకొస్తారని సమాచారం.

ప్రత్యేక పంచాయతీతోనే సమస్యలు పరిష్కారం

- ఆర్అండ్ఆర్ కాలనీని సందర్శించిన కలెక్టర్
- గుర్తింపు కార్డుల బదిలీ వెంటనే జరగాలి
- అప్పుడే కాలనీవాసులకు తగిన న్యాయం



కృష్ణునిపాలెంలోని ఆర్అండ్ఆర్ కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

గోకవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామ శివారున నివాసం ఉంటున్న ఆర్అండ్ఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆర్అండ్ఆర్ కాలనీలో గత కొంతకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో బుధవారం ఆమె కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిర్వాసితులను నేరుగా కలుసుకొని ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం, ఉపాధి పనులు లేకపోవడం, శ్మశానవాటిక తదితర సమస్యలను ఇక్కడ నివాసం ఉంటున్న 18 పోలవరం నిర్వాసిత గ్రామాలవాసులు కలెక్టర్ దృష్టికి తీసికెళ్లారు. దీంతో జిల్లా కలెక్టర్ స్పందిస్తూ నిర్వాసితులకు చెందిన రేషన్, ఆధార్, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఇప్పటికీ ఏజెన్సీ పరిధిలో ఉండడం, అక్కడ నుంచి ఇక్కడకు ఇంతవరకూ బదిలీ కాకపోవడం వల్ల తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయలేకపోతునామన్నారు. వెంటనే నివాసితులంతా తమ గుర్తింపు కార్డులను గోకవరం మండలంలోకి బదిలీ చేయించుకొని, తద్వారా ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసుకుంటే వెంటనే ప్రభుత్వపరంగా కల్పించాల్సిన మౌలిక సదుపాయాలన్నింటినీ పూర్తి చేస్తామని నిర్వాసితులకు ఆమె హామీ ఇచ్చారు. ఇందుకోసం ఆర్అండ్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న 18 గ్రామాల ప్రజలతో గ్రామసభలు నిర్వహించి అంగీకారం తీసుకోవాల్సిందిగా స్థానిక అధికారులను ఆదేశించారు. నిర్వాసితుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే నెహ్రూ పదేపదే తన దృష్టికి తీసుకురావడంతో తాను ఈ సందర్శనకు వచ్చానని కలెక్టర్ తెలియజేశారు. కార్యక్రమంలో తహశీల్దారు సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీసీపీవో రీ-నోటిఫికేషన్ వెనుక మతలబు ఏమిటో?

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీవో) నియామకం గురించి జారీచేసిన నోటిఫికేషన్ రద్దుచేసి.. మళ్లీ తాజాగా నోటిఫికేషన్ ప్రకటించడం వెనుక పలు ఆరోపణలు వినవస్తున్నాయి. బాలల సంరక్షణ కోసం జిల్లాకు ఒక అధికారి ఉంటారు. జిల్లా డీసీపీవో రాజ్‌కుమార్ ఈ ఏడాది జనవరిలో మృతి చెందారు. ఆ పోస్టు భర్తీ చేయడం కోసం 15రోజుల తర్వాత నోటిఫికేషన్ ఇచ్చారు. సుమారు 90 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా నియామకాల కమిటీ ఇంటర్వ్యూల ద్వారా పోస్టు భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇటీవల ఆ నోటిఫికేషన్‌ని రద్దు చేశారు. మంగళవారం రీ-నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నోటిఫికేషన్‌లో పలు సామాజిక వర్గాలకు వయసు సడలింపు ఇచ్చారు. చివరిగా డీసీపీవోల కోసం 2023 డిసెంబరులో ఇంటర్వ్యూలు జరిగాయి. 2024 జనవరిలో నియామక పత్రాలు అందజేశారు. ఆ నోటిఫికేషన్‌లో, ఇప్పుడు రద్దు చేసిన నోటిఫికేషన్‌లో వయసు సడలింపు లేదు. 42 ఏళ్ల వయసులోపు వారు అర్హులు. అయితే వైసీపీ హయాంలో నియమించిన రాష్ట్ర బాలల సంరక్షణ కమిటీలోని వైసీపీ సానుభూతిపరుడైన ఓ సభ్యుడు జిల్లా డీసీపీవో పోస్టుపై కన్నేశారని చెబుతున్నారు. ఆ కమిటీ గడువు ఓ నెలతో ముగుస్తుంది. దీంతో ఆయన వయసు అర్హత పరిధిలోకి రావాలనే ఉద్దేశంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు లేఖ సమర్పించడం ద్వారా 42 ఏళ్లుగా ఉన్న వయసు పరిమితిని 47గా మార్పు చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎంతమంది దరఖాస్తు చేసినా ఆయనకే పోస్టు దక్కేలా పావులు కదుపుతున్నారని చెబుతున్నారు. ఆ స్థానంలో ఇప్పటివరకూ పని చేసిన రాజ్‌కుమార్ కూడా రాజమండ్రి మాజీ ఎంపీ భరత్‌రామ్ అండదండలతో పోస్టు దక్కించుకున్నారని ప్రచారం జరిగింది.


sf | సుందరం హోమ్
సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం: నం. 21, పట్టుల్లోస్ రోడ్, చెన్నై - 600002. ఫోన్: 044-2852 1181.
కార్పొరేట్ కార్యాలయం: "సుందరం టవర్స్", 46, వైట్స్ రోడ్, చెన్నై - 600014.
ఫోన్: 044-2851 5267. ఈ -మెయిల్: corporateaffairs@sundaramhome.in
వెబ్ సైట్: www.sundaramhome.in,
CIN: U65922TN1999PLC042759

సవరణ

సిరికేతన, 1వ అంతస్తు, ఇంటి నం. 86-15-8/1, బ్లాక్ నం. 18, జె. ఎన్. రోడ్, వాద్రేవు నగర్, రాజమండ్రి - 533103 వద్ద గల మా రాజమండ్రి శాఖ డోర్ నం. 76-5-27, గానుగుల వీధి, రాజమండ్రి, గాంధీపురం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 533103 కి 25-02-2025 నుండి వర్తింపుతో బదిలీ చేయబడుతుందని తెలియజేస్తూ 21-11-2024 తేదీ గల మా ప్రకటన తదుపరిగా ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, పైన తెలిపిన నూతన ఆవరణకు మార్చుట అనునది అనివార్య కారణాల వలన 26-04-2025కు వాయిదా వేయబడినది. మా శాఖ ప్రస్తుత ప్రదేశం లోనే 25-04-2025 వరకు నిర్వహణకు కొనసాగుతుంది.

ప్రదేశం: చెన్నై, తేదీ: 10-04-2025

సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరఫున
ఆర్. వెంకటసుబ్రమణియన్,
చీఫ్ కాంప్లియన్స్ ఆఫీసర్ & కంపెనీ సెక్రటరీ



పల్లె నుంచి పదవుల పల్లకీలోకి...

తొండంగి/తుని రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతానికి చేరువలో ఉన్న అతి చిన్న గ్రామం ఏవీ నగరం. కాకినాడ జిల్లా తొండంగి మండలంలో ఉన్న ఈ గ్రామాన్ని రాష్ట్ర రాజకీయ యవనికపై ఘనంగా నిలిపిన ఘనత టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు, రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుకే దక్కుతుంది. 42 ఏళ్ల ఆయన రాజకీయ ప్రస్థానంలో యనమల ఉన్నతిని చూసి స్వగ్రామమైన ఏవీ నగరం మురిసింది. ఈ గ్రామం అంటే ఆయనకూ అంతే ప్రేమ. రాష్ట్రంలో కీలకమైన పాలనా బాధ్యతలు భుజాన మోస్తున్న తరుణంలో కూడా సొంతూరికి వెళ్లి రావడానికే ఎప్పుడూ తొలి ప్రాధాన్యమే ఇచ్చారు. యనమల అప్పారావు-సరస్వతి దంపతులకు ఆఖరి సంతానం రామకృష్ణుడు. ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామంలోనే. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు సమీపంలోని రావికంపాడు ఉన్నత పాఠశాలలోను, పది నుంచి డిగ్రీ వరకు రాజమహేంద్రవరంలోను విద్యాభ్యాసం చేశారు. ఎంఏ, ఎల్ఎల్‌బీ మధ్యప్రదేశ్‌లో చదివారు. అనంతరం కాకినాడలో న్యాయవాద వృత్తి చేపట్టారు.

రాజకీయ ప్రస్థానం ఇలా...

అప్పటి కాంగ్రెస్ రాజకీయాలతో విసిగి వేసారిన తుని ప్రాంత ప్రజలు ఐక్య సంఘంగా ఏర్పడి ఎన్నికల బరిలో నిలిపేందుకు అనువైన అభ్యర్థి కోసం వెతుకుతున్న సందర్భంలో సామాజికపరంగానూ, విద్యాపరంగానూ అన్ని అర్హతలు ఉన్న యనమల రామకృష్ణుడు వారి దృష్టిని ఆకర్షించారు. అదే సమయంలో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ప్రకటించడంతో ఐక్య సంఘం మొత్తం యనమల వెంట నిలిచి ఆయన్ను తుని నుంచి బరిలోకి దింపేందుకు కృషి చేసింది. అత్యున్నత విద్యార్హతలతో పాటు మృదుస్వభావం ఉన్న యనమల ఎన్టీఆర్ దృష్టిని కూడా ఆకర్షించడంతో ఆయన రాజకీయ ప్రస్థానానికి అంకురార్పణ జరిగింది. 1983లో తుని నుంచి యనమల టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. నాటి నుంచి వరుసగా ఒకే పార్టీ ఒకే గుర్తుపై ఆరుసార్లు ఎన్నికయ్యారు. రెండుసార్లు శాసనమండలి సభ్యునిగా పనిచేశారు. మొదటి గెలుపులోనే పురపాలక, న్యాయ శాఖ మంత్రిగా అతిపిన్న వయసులో పదవి చేపట్టారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ఆయనకు ఉన్నత పదవులు దక్కాయి. మేధావిగా, పార్టీ సిద్ధాంతకర్తగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా మెలిగారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా, శాసనసభ స్పీకర్‌గా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్‌గా, శాసనమండలి ప్రతిపక్ష నేతగా... పదవులకే వన్నె తెచ్చారు. ఎన్ని పదవులు చేపట్టినా ఆయన స్వగ్రామానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇప్పటికీ ఆయన తన ఓటు హక్కును స్వగ్రామంలోనే వినియోగించుకుంటున్నారు.

42 ఏళ్లు ఒకే పార్టీ... ఒకటే జెండా
ఏవీ నగరానికి కీర్తి కిరీటం
యనమల రామకృష్ణుడు


తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావుతో రామకృష్ణుడు

పుట్టిన ఊరు రుణం తీర్చుకునేందుకు యనమల తమ స్వగ్రామమైన ఏవీ నగరంలో అనేక ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, షిర్డీ సాయిబాబా ఆలయాలను నిర్మించి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అనేక మంది పీఠాధిపతులు, ప్రవచనకర్తలు ఆలయాన్ని సందర్శించారు. 2014లో యనమల ఫౌండేషన్ స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనేక మెడికల్ క్యాంపులు నిర్వహించారు. స్థానిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ సదుపాయం కల్పించారు. విద్యార్థులకు లక్షలాది రూపాయలను ఉపకార వేతనాలుగా అందించారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పించారు. గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటుచేశారు. అనేక క్రీడా పోటీలు నిర్వహించారు. దీంతో పాటు మరెన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. 42 సంవత్సరాల ప్రస్థానంలో స్వగ్రామం ఆయన వెన్నంటి నిలిచింది. అదే రీతిలో యనమల కన్న ఊరును మరిచిపోకుండా ఇప్పటికీ ఏవీ నగరం బిడ్డగానే మసలుతున్నారు.


చంద్రబాబునాయుడుతో యనమల

నేడు తునిలో '42 వసంతాల రాజకీయ ప్రస్థానం' పుస్తకావిష్కరణ

తుని రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యనమల రామకృష్ణుడు 42 వసంతాల రాజకీయ ప్రస్థానం సభ, పుస్తకావిష్కరణ గురువారం సాయంత్రం తునిలో జరగనున్నాయి. టీడీపీ తుని నియోజకవర్గ శ్రేణుల ఆధ్వర్యంలో తుని పట్టణ శివారులోని సాయి వేదిక ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరై పుస్తకావిష్కరణ చేస్తారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఫొటో గ్యాలరీని ప్రారంభిస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు సీనియర్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్టు పార్టీ నాయకులు చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు ఆరువేల మందికి పైగా తరలివస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేశారు. సభ ఏర్పాట్లను ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య బుధవారం పరిశీలించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివ్య

రెండో రోజుకు సైనిక విన్యాసాలు


ఆకాశంలో చక్కర్లు కొడుతున్న యుద్ధ విమానం


సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రయింఫ్ సైనిక విన్యాసాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం యుద్ధ విమానాలు ఆకాశంలో చక్కర్లు కొట్టాయి. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట నేవల్ ఎన్‌క్లేవ్‌లో భారత తూర్పు నావికాదళం, అమెరికా (యూఎస్) యాంఫీబియాస్ విన్యాసాల్లో భాగంగా అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఇరు దేశాలు సంయుక్తంగా సముద్రం, ఆకాశంలో సైనిక విన్యాసాలు నిర్వహించాయి. టైగర్ ట్రయింఫ్ యాంఫీబియాస్ విన్యాసాలు ఈ నెల 13వ తేదీ వరకు జరుగుతాయని త్రివిధ దళాల అధి కారులు తెలిపారు. విన్యాసాలు జరిగే ఔటర్ ప్రాంతాలను కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత పర్యవేక్షించారు.


సూర్యారావుపేట తీర ప్రాంతంలో యుద్ధ ట్యాంకర్లు, వాహనాలు

అంతర్వేదిలో సాగర్ కవాచ్


బోటును తనిఖీ చేస్తున్న మెరైన్ పోలీసులు

అంతర్వేది, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీర ప్రాంతంలో మెరైన్ పోలీసులు, సీఐ అల్లు నవీన్ నరసింహ ఆధ్వర్యంలో బుధవారం సాగర్ కవాచ్ నిర్వహించారు. ముష్కరులను పట్టుకునేందుకు అంతర్వేదిలో పోలీసు, మెరైన్ సిబ్బంది 58 మందితో, పశ్చిమ గోదావరి జిల్లా పేరుపాలెంలో 68 మందితో సాగర్ కవాచ్ నిర్వహించారు. గురువారం కూడా సాగర్ కవాచ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు కె.దుర్గాశ్రీనివాస్, నాగరాజు, వీరాస్వామిరాజు పాల్గొన్నారు. బుధవారం తీర ప్రాంతమైన అల్లవరం మండలం ఓడలరేవు నుంచి అంతర్వేది మీదుగా పేరుపాలెం వరకు సాగర్ కవాచ్ నిర్వహించారు.



రైతు కావ్యానికి ఉత్తమ దీర్ఘ కవితా పురస్కారం

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా అత్యుత్తమ దీర్ఘ కవితా పురస్కారం 'వచన కవితా సహస్రావధాని' ర్యాలి ప్రసాద్ రచించిన రైతు కావ్యానికి లభించింది. భారతదేశంలోని రైతుల దుర్భర జీవితాన్ని, రైతుల ఆవశ్యకతను తెలుపుతూ రచించిన ఈ కావ్యం ఆద్యంతం స్ఫూర్తిదాయకంగా నిలిచిందని, ప్రతి ఒక్క రైతు విలువను తెలిపేలా రచయిత ఈ కావ్యాన్ని రచించారని ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య మక్కెన శ్రీను తెలిపారు. ఈ నెల చివరి వారంలో పురస్కార ప్రదానోత్సవం ఉంటుందని చెప్పారు. ప్రసాద్‌ను పలువురు సాహితీవేత్తలు, ఆదిత్య యూనివర్శిటీ చాన్సలర్ నల్లమిల్లి శేషారెడ్డి, కాకినాడ రచయితల సంఘం ఉపాధ్యక్షుడు గొడవర్తి సత్యమూర్తి, కార్యదర్శి టీవీవీ సత్యనారాయణ, కోశాధికారి వడిశెట్టి భాస్కరరెడ్డి, కార్యవర్గ సభ్యులు అభినందించారు.


రచయిత ర్యాలి ప్రసాద్

ఏపీఈఏపీసెట్‌కు 2,83,070 దరఖాస్తులు

- మే 19 నుంచి 27 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు
- అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు
- కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు


ఏపీఈఏపీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపీసెట్)-2025కు ఇప్పటివరకు 2,83,070మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు బుధవారం 'ఆంధ్ర జ్యోతి'కి తెలిపారు. ఇంజనీరింగ్‌కు 2,22,989 మంది, అగ్రికల్చర్ ఫార్మసీకి 59,507మంది, రెండింటికీ 574 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, మే 19 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఏపీలో 46, తెలంగాణలోని హైదరాబాద్‌లో 2కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. గత ఏడాది వరకు తెలంగాణ ఈఏపీసెట్‌కు ఏపీ విద్యార్థులు, ఏపీఈఏపీసెట్‌కు తెలంగాణ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేవారు. కానీ రెండు రాష్ట్రాలు నాన్ లోకల్ కోటా తీసేయడంతో ఏపీ ఈఏపీసెట్‌కు ఈఏడాది సుమారు 30వేలకుపైగా దరఖాస్తులు పెరిగే అవకాశముందన్నారు. విద్యార్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు.

మే 19 నుంచి 20 వరకు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు రోజుకు రెండు సెషన్లలో, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి మే 21నుంచి 27 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మే 24న పరీక్ష ఒక సెషన్‌లో మాత్రమే ఉంటుందని 25న పరీక్ష ఉండదన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు తమ సందేహాల నివృత్తికి https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారాగానీ 0884 2359599, 2342499 నెంబర్లలోగానీ helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారాగానీ సంప్రదించవచ్చని కన్వీనర్ సుబ్బారావు సూచించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకే 'తలాష్'

- నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రసన్నశ్రీ



సదస్సులో మాట్లాడుతున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

సర్పవరంజంక్షన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, వ్యాపార దృక్పథం, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచడంతో పాటు సృజనాత్మకతను వెలికితీసేందుకు 'తలాష్' ఫెస్ట్ ఉపయోగపడుతుందని నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో కామర్స్-మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో తలాష్-2కే25 జాతీయస్థాయి మేనేజ్‌మెంట్ ఉత్సవాన్ని ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాం తిశ్రీతో కలిసి ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసన్నశ్రీ మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న సవాళ్లను ఎదుర్కోవడానికి ఇటువంటి నాలెడ్జ్‌ఫెస్ట్‌లు ఉపయోగపడతాయన్నారు. ప్రతి విషయాన్నీ సృజనాత్మకతతో ఆలోచించడం అలవర్చుకోవాలని, పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు కొం గొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు చేయడంతో నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చక్కని కార్యక్రమం నిర్వహించిన కామర్స్ మేనేజ్‌మెంట్ నిర్వాహకులను అభినందించారు. ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభాత్ గుప్త మాట్లాడుతూ ఈ ఫెస్ట్ ఉద్యోగ అవకాశాలకు చక్కగా ఉపయోగపడుతుందన్నారు. మేనేజ్‌మెంట్ గేమ్స్ విభాగంలో కార్పొరేట్ చాలెంజ్, ట్రేడింగ్ టైటాన్స్, బిజినెస్ ఆర్కిటెక్ట్స్, స్ట్రాటజీ సీకర్స్, కేస్‌ఏ మేనియా, నెక్స్ట్ బాస్, ట్రెజర్ హంట్, స్పీక్ స్మార్ట్ వంటి పోటీల పట్ల విద్యార్థులు ఎంతో ఆసక్తి కనబరిచారు. విద్యార్థులకు నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటలు, మిస్టర్ అండ్ మిస్ తలాష్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రోగ్రామ్, కామర్స్ మేనేజ్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ డి.అజయ్ రతన్, ఓఎన్జీసీ జీఎం (హెచ్‌ఆర్) కె.సునీల్, అధ్యాపకులు డాక్టర్ శ్రీరామరాజు, డాక్టర్ మధుకుమార్, మణికంఠేశ్వర్‌రెడ్డి, మనోజ్ దేవ, డాక్టర్ అప్పారావు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమారజిత, తాడేపల్లిగూడెం క్యాంపస్, ఆదిత్య, ఫైడా, సంజీవి, ప్రకాష్, స్పేస్, ఏఎస్‌డీ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయం రూ.18.25లక్షలు


చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ఆలమూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర ఉత్సవం అనంతరం హుండీల లెక్కింపు బుధవారం నిర్వహించారు. హుండీ ఆదాయం రూ.18,25,424లు లభించింది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజుచౌదరి, ఉత్సవప్రత్యేకాధికారి బాలాజీరామ్‌ప్రసాద్‌ల ఆధ్వర్యంలో హుండీలను తెరచి లెక్కించారు. మార్చి 27నుంచి ప్రారంభమైన జాతర ఉత్సవాలకు ముందు హుండీలను లెక్కించగా ఉత్సవాల తదుపరి బుధవారం లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవా కమిటీ ఛైర్మన్ గన్ని వెంకట్రావు, మాజీ ఛైర్మన్‌లు వైట్ల శేషబాబు, దొమ్మేటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక జాతర ఆదాయం రూ.54.07లక్షలు

చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతర ఉత్సవాల సందర్భంగా రూ.54.07లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వీర్రాజుచౌదరి తెలిపారు. జాతర ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన వేలంపాటల ద్వారా రూ.13,13 లక్షలు, టిక్కెట్లు విక్రయం ద్వారా రూ.16.48లక్షలు, భక్తుల విరాళాలు రూ.3.88లక్షలు, షాపుల ద్వారా రూ.2.15లక్షలు, అమ్మవారి పొన్నుల ద్వారా రూ.17.8వేలు, వివిధ ఆదాయాల ద్వారా రూ.44వేలు, హుండీ ద్వారా రూ.18,25,424లు ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

వైభవంగా పొన్న వాహన మహోత్సవం

- మూడో రోజు స్వామివారి శ్రీకల్యాణోత్సవాలు


పొన్నవాహనంపై శ్రీవారు

ఆత్రేయపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణమహోత్సవాలలో భాగంగా మూడోరోజు బుధవారం స్వామివారి మేలుకొల్పు, గౌతమినది నుంచి తీర్థపు బిందెతో గోదావరి జలాలను తీసుకువచ్చి స్నపనమూర్తులకు అభిషేకం నిర్వహించారు. విశేష అర్చన, నిత్యహోమాలు, బలిహరణ, ద్రవిడవేద పారాయణం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ప్రధాన హోమాలు, దిగ్దేవత బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. తణుకు సత్యాపురానికి చెందిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి 7.01నిమిషానికి ఉభయదేవేరులతో స్వామివారు పొన్నవాహనంపై అలంకృతుడయ్యారు. మేళతాళ మంగళవాయిద్యాలు వేద మంత్రోచ్చరణల నడుమ తిరువీధులలో పొన్నవాహనసేవ ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది. విద్యుత్‌కాంతులనడుమ ఉత్సవాలను నిర్వహించారు. ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు నిర్వహించారు.




గోదావరి నదీజలాలను తీర్థపు బిందెతో తీసుకువస్తున్న దృశ్యం, పొన్నవాహన మహోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు


గన్నవరంలో కల్లంలో తడిసిన మిర్చిపంట

అకాల వర్షం..

- కల్లాల్లో మిర్చికి దెబ్బ
- ధర, దిగుబడిలేక ఇప్పటికే రైతు కుదేలు

ఎటపాక ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి: అకాల వర్షం మిర్చి రైతుని మరోమారు నష్టాల ఊబిలోకి నెట్టింది. బుధవారం రాత్రి గాలి వానతో వర్షం కురిసింది. దాంతో ఇప్పటికే కోతలు నిర్వహించి కల్లాల్లో ఆరబెట్టిన మిర్చిపంట తడిసిపోయింది. కొందరు రైతులు ముందుగా వాతావరణ పరిస్థితులను గమనించి ఆరబెట్టిన పంట, మిర్చి రాశులపై టార్పాలిన్లు, బరకాలు రక్షణగా కప్పారు. అయినా చాలాచోట్ల వర్షం రాకను గమనించకపోవడంతో కల్లాల్లోని పంట తడిసిపోయింది. దీంతో పంట తడవడంతో రంగుమారి నాణ్యత కోల్పోయి ధర తక్కువగా పలుకుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పంటకు సరైన ధర, దిగుబడిలేక కుదేలైన రైతుకు వర్షం మరో ఎదురుదెబ్బలా తగిలినట్టైంది. ఏజెన్సీలో ఈనెలాఖరు వరకు మిర్చి కోతల పనులు చేపట్టనున్నారు.


నందిగామలో మిర్చిపై కప్పిన టార్పాలిన్లు

అర్ధరాత్రి అలజడి!

- బాణసంచా కాల్పుల్లో భారీ విస్ఫోటనం
- భయంతో రోడ్లపైకి వచ్చిన ప్రజలు
- రామచంద్రపురంలో కంపించిన భవనాలు
- పగిలిన వాణిజ్య సముదాయాలు, భవనాల అద్దాలు, రూ.18.20 లక్షల ఆస్తినష్టం



విస్ఫోటనం జరిగిన ప్రాంతం

రామచంద్రపురం (ద్రాక్షారామ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మార్కెట్ సెంటర్ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవ సంబరాల్లో అపశృతి చోటుచేసుకుంది. సంబరాల్లో మంగళ వారం అర్ధరాత్రి 12.51 గంటలకు బాణసంచా కాల్పుల్లో భారీ విస్ఫోటనం సంభవించింది. పేలుడుధాటికి మార్కెట్ సెంటర్‌లోని రైతుబజార్ పరిసర ప్రాంతాల్లో వాణిజ్యసముదాయాలు, వికాస్ కళాశాల, సినిమా థియేటర్లు, పలు భవనాల అద్దాలు ధ్వంసం అయ్యాయి. 1000 మీటర్లు వరకు పేలుడు ప్రభావం కనిపించింది. లక్షల్లో ఆస్తినష్టం సంభవించింది. అర్ధరాత్రి భవనాలు కంపించడంతో ప్రజలు భయాందోళనలు చెందారు. భయంతో రోడ్లపైకి చేరుకున్నారు.

అసలేం జరిగిందంటే....

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో మంగళవారం రాత్రి నుంచి బాణసంచా కాల్పులు ప్రారంభించారు. 12.50 గంటల ప్రాంతంలో పేలుడు స్తంభం వెలిగించారు. అది దశలవారీగా పేలవలసి ఉంది. అయితే స్తంభానికి చుట్టిన నారతొట్లు, టపాసులదండ జారి పోవడంతో భారీ విస్ఫోటనం సంభవించింది. పేలుడు దాటికి పక్కనే ఉన్న వికాస్ కళాశాల కంప్యూటర్ ల్యాబ్ అద్దాలు ధ్వంసం కావడంతో పాటు మూడో అంతస్తులో క్లాసురూముల్లో పీవోపి సీలింగ్ ఊడిపడిపోయింది. గోడలు బీటలు వారాయి. కళాశాల బస్సు అద్దాలు పగిలిపోయాయి. కంప్యూటర్ ల్యాబ్‌లో సీసీ కెమెరాలో పేలుడు దాటికి అద్దాలు ధ్వంసం కావడం రికార్డుఅయింది. రెండు నిమిషాలకుపైగా అద్దాలు ధ్వంసం కావడం కనిపించింది. పక్కనే ఉన్న వెంకటరమణ సిమెంటు, ఐరన్‌ట్రేడర్స్ షాపుల సముదాయంలో నష్టం సంభవించింది. హవెల్స్ షోరూమ్, సెరా స్టైల్ సెంటర్ అద్దాలు పగిలిపోయాయి. షట్టర్లు వేసి ఉండగానే 18 అంగులాలు మందం కలిగిన అద్దాలు, డిస్‌ప్లే హోర్డింగులు, సీలింగులు ధ్వంసం అయ్యాయి. సమీపంలో కిషోర్ సినిమా థియేటర్, అన్నపూర్ణ థియేటర్ అద్దాలు పగిలిపోయాయి. లక్షల్లో ఆస్తినష్టం సంభవించింది. పేలుడు ధాటికి పలు భవనాలు కంపించడంతో భూకంపం ఏమైనా వచ్చిందా అనే భయంతో ప్రజలు ఆందోళన చెందారు. రోడ్లపైకి చేరుకున్నారు. బాణసంచా ప్రేలుడు నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకున్నారు. పేలుడు దాటికి పలువురు గాయపడినట్లు తెలుస్తుంది. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స తీసుకుని వెళ్లిపోయినట్టు వైద్యులు తెలిపారు.





పేలుడుకు ధ్వంసం అయిన వికాస్ కళాశాల కంప్యూటర్ ల్యాబ్, సెరా షోరూమ్ అద్దాలు



ఘటనా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, అధికారులు

అధికారులు, నాయకుల పరిశీలన

పేలుడు జరిగిన ప్రాంతం, సమీపంలో నష్టపోయిన వెంకటరమణ ట్రేడర్స్ వికాస్ కళాశాల ప్రాంతాలను ఆర్డీవో అఖిల, డీఎస్పీ రఘువీర్ పరిశీలించారు. రూ.18.20 లక్షలు ఆస్తినష్టం సంభవించినట్టు ఆర్డీవో తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం నష్టపోయిన వారిని పరామర్శించారు. విస్ఫోటనం దాటికి నష్టపోయిన వెంకటరమణ ట్రేడర్స్, వికాస్ కళాశాల, సినియా థియేటర్లతో పాటు పలువురు భవనాల యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. నష్టానికి కారణమైన ఆంజనేయ ఫైర్‌వర్క్స్ దవులూరి శివ, కమిటీ సభ్యులను అదుపులోకితీసుకుని విచారిస్తున్నామన్నారు.

సీటీఎస్ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని వివిధ పరిశ్రమల్లో ట్రైనింగ్ అయిన అర్హులైన వారి నుంచి ప్రైవేట్ అభ్యర్థులుగా ఏఐటీఐ 2025 అండర్ (సీటీఎస్) పరీక్షలకు హాజరయ్యేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ డైరెక్టర్ కోరుతున్నారు. ప్రైవేట్‌గా ఐటీఐ ఆలిండియా ట్రేడ్ పరీక్ష రాసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో అందజేయాలని కన్వీనర్ జీవేణుగోపాల్‌వర్మ కోరారు. ఐదేళ్ల తర్వాత ఈ అవకాశం కల్పిస్తున్నామని, మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐ 9701215511 నెంబరును సంప్రదించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

డెల్టాకు రబీ నీటి విడుదల నిలిపివేత

సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్

మోతుగూడెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టాలోని రబీ పంటలకు సీలేరు నుంచి నీటి విడుదల నిలిపివేసినట్టు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు తెలిపారు. సీలేరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఫిబ్రవరి 10 నుంచి డొంకరాయి జలాశయంలో విద్యుదుత్పత్తి చేయకుండా నేరుగా గోదావరి డెల్టాకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. జల వనరుల శాఖాధికారుల సూచనమేరకు మంగళవారం నుంచి నీటి విడుదల నిలిపివేశామన్నారు. ఇప్పటివరకు గోదావరి డెల్టాకు డొంకరాయి జలాశయం నుంచి 15టీఎంసీల నీటిని విడుదల చేశామని, ప్రస్తుతం పవర్ కెనాల్ ద్వారా విద్యు దుత్పత్తి అనంతరం 4300క్యూసెక్కులు వెళ్తోందని తెలిపారు. ఉమ్మడి నిర్వహణలోని బలిమెల, డొంకరాయి జలాశయాల్లో 48నుంచి 50టీఎంసీలు నీటి నిల్వలున్నాయని, వర్షాకాలం వరకు విద్యుదుత్పత్తికి డోకా ఉండదని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



సమావేశంలో మాట్లాడుతున్న సునీత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందడంలో ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధత కలిగి బాధ్యతల్ని నిర్వర్తించాలని, ఆయా వర్గాలకు అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆదేశించారు. బుధవారం రాజమహేంద్రవరంలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో వివిధవర్గాలకు సామాజిక సాధికారత పథకాల అమలుపై సమన్వయ శాఖల అధికారులతో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీజే మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రారంభించి వాటిని అర్హులకు అందే విధంగా వారిని చైతన్యవంతం చేయాలన్నారు. నిరుపేదలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశంపెట్టడం జరుగుతోందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై న్యాయ సేవాధికార సంస్థల సిబ్బంది కూడా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలపై కార్యశాలలు నిర్వహించి పథకాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీ వర్కర్లతో మమేకం కావడం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.గాయత్రి దేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, లీగల్ ఎయిడ్ డిఫ్యూటీ చీఫ్ పీఎంఆర్.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

400 కిలోల జీడిపప్పు.. మాడి బొగ్గాయే



విద్యుత్ సమస్యతో మాడి బొగ్గు అయిన జీడిపప్పు

మలికిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోపక్క వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరం సబ్‌స్టేషన్ వద్ద బ్రేకర్ లింబ్ వారం రోజుల క్రితం కాలిపోయింది. అధికారులు సరిగా స్పందించకపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. సర్దుబాటు చర్యల్లో భాగంగా మలికిపురం సబ్‌స్టేషన్ విద్యుత్‌తో అనుసంధానం చేశారు. మోరి, మోరిపోడులలో 12 జడీపప్పు ఫ్యాక్టరీలు ఉన్నాయి. మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో అధికారులు సరిగా స్పందించలేదు. విద్యుత్ ఒక ఫేస్ కాలిపోయి, రెండు ఫేస్‌లలో విద్యుత్ రావడం, దీనికి తోడు హై ఓల్టేజ్ రావడంతో పలు జీడిపప్పు ఫ్యాక్టరీల్లో మోటార్లు కాలిపోగా ముప్పర్తి సుబ్బారావుకు చెందిన జీడిపప్పు ఫ్యాక్టరీలో 400కిలోల జీడిపప్పు మాడి బొగ్గు అయిపోయింది. రూ.4లక్షల నష్టం వాటిల్లినట్టు ఫ్యాక్టరీ యజమాని తెలిపారు. సంఘటనా స్థలాన్ని విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్ పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. తరచూ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని మోరిపోడు సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగాత్రివేణి, టీడీపీ సఖినేటిపల్లి మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని, జనసేన నేత బళ్ల రాము డిమాండ్ చేశారు.

నల్లజర్ల మండలంలో... దారుణం!

- బాలబాలికలను లైంగికంగా వేధిస్తున్న వృద్ధుడు
- పోక్సో నమోదు.. పోలీసుల అదుపులో నిందితుడు
- కామాంధుడికి హెచ్ఐవీ ఉండడంతో తల్లిదండ్రుల ఆందోళన

నల్లజర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అసలే వృద్ధుడు.. పైగా హెచ్ఐవీ బాధితుడు. ముక్కుపచ్చలారని బడి పిల్లలపై లైంగిక చర్యలతో వేధించాడు. చాక్లెట్లు, బిస్కెట్లు ఎరచూపి వారితో జుగుప్సాకరమైన రీతిలో ప్రవర్తించాడు. విషయం బయటకు రావడంతో పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలోని ఓ గ్రామంలో అరవై ఏళ్ల వృద్ధుడికి హెచ్ఐవీ ఉంది. పాఠశాలలో నాలుగైదు తరగతులు చదువుకుంటున్న బాలబాలికలు పాఠశాల విడిచిన తర్వాత పక్కనే ఖాళీ స్థలంలో ఆడుకునేవారు. వారి తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లేవారు కావడంతో వారు వచ్చేదాకా అక్కడే పిల్లలంతా కాలక్షేపం చేసేవారు. ఇదే అదనుగా నిందితుడు అక్కడి పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చి మచ్చిక చేసుకుని సమీపంలోని ఆయిల్‌పామ్ తోటలోకి తీసుకెళ్లేవాడు. ఏడు ఎనిమిదేళ్ల వయసున్న ముగ్గురు బాలురు, ఐదుగురు బాలికలను మభ్యపెట్టి తోటలో అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఇది గత నెల రోజులుగా జరుగుతున్నా వారంతా భయంతో ఎక్కడా నోరు విప్పలేదు. కానీ బాలికలతో పాటు కొంతమంది బాలురుని కూడా తీసుకెళ్లడంతో ఆ విషయం ఒక బాలుడు తన తల్లికి చెప్పాడు. కానీ పిల్లల కుటుంబాల పరువుపోతుందే మోనని ఎవరూ ఈ విషయాన్ని బహిర్గతం చేయడానికి ముందుకు రాలేదు. ఇటీవల ఆ కాలనీలో ఒక బాల్య వివాహం ఆపడానికి ఐసీడీయస్ సిబ్బంది వెళ్లడంతో ఆ ప్రాంత ఆశ కార్యకర్త ఈ విషయాన్ని వారితో ప్రస్తావించారు. చివరకు మంగళవారం ఐదుగురు తల్లులు తమ పిల్లలను తీసుకుని ఐసీడీయస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి సహాయంతో సీఐ రాంబాబుకు ఫిర్యాదు చేశారు. ఆయన తల్లులను, పిల్లలను విడివిడిగా జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. బుధవారం తొమ్మిది మంది బాలబాలికలకు వైద్య పరీక్షలు చేయించారు. రిపోర్టు రావాల్సి ఉంది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్టు సీఐ రాంబాబు పేర్కొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై కొనసాగుతున్న దర్యాప్తు

తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతిపై దర్యాప్తు కొనసాగుతుందని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ స్పష్టం చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలో ఇతర కేసులపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతికి సంబంధించి వివిధ ఏజెన్సీలతో కలిపి పారదర్శకంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ తదితర నివేదికలు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికీ ఎవరి వద్దనైనా ఏమైనా ఆధారాలుంటే పోలీసులకు సమర్పించాలని సూచించారు. వారు చెప్పే విషయాలు ఆధార సహితంగా ఉండాలని, వదంతులను ఆధారంగా తీసుకుని ప్రకటనలు చేయలేమన్నారు. సోషల్ మీడియాలో లేదా బహిరంగంగా, ఆధారరహితంగా ఏవైనా పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/ రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668

AJD:207821

BUSINESS OFFER

★ లాభదాయకమైన వ్యాపారం లక్షకు పైగా - లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్రొడక్ట్ ఉత్పత్తితో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్డ్) ఫోన్: 8376001873, 9643010487, 8376089771, 011-25920179

AJH-003082

WANTED

★ టికార్లక్షేమ హోంకేర్ నందు వృద్ధులను / పేషంట్స్‌ని / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని / వంట పనిచేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph.: 99120 11499, 99120 11899.

AJH-003147

4 Lines CLASSIFIED Rs.230/- Only

వయసు 33.. కేసులు 69

- 16 ఏళ్ల నుంచే చోరీలు
- అంతర్ జిల్లా దొంగ ఆట కట్టించిన తూర్పు గోదావరి జిల్లా పోలీసులు
- 630 గ్రాముల బంగారు, 4కిలోల వెండి, సుమారు రూ.లక్ష నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చిన్న వయసు నుంచే చోరీల బాట పట్టాడు. ఆ సొమ్ముతో విలాసాలకు అలవాటు పడ్డాడు. ఎన్ని సార్లు జైలుకు వెళ్లొచ్చినా మార్పు రాలేదు. దొంగతనం చేయడం.. పట్టుబడితే జైలుకు వెళ్లడం.. తిరిగి రావడంతోనే మళ్లీ చోరీలు చేయడం.. ఇదే అతడికి దైనందిన జీవనంగా మారిపోయింది. దీంతో 33ఏళ్లకే 69 కేసులు నమోదయ్యాయి. ఉండ్రాజవరానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు పోలీసులు ఆ దొంగ ఆట కట్టించారు. ఈ మేరకు ఎస్పీ నరసింహ కిషోర్ వివరాలను వెల్లడించారు. భీమవరం టౌన్ పరిధిలోని గునుపూడికి చెందిన పందిరి వెంకట నారాయణ ప్రస్తుతం ఏలేశ్వరంలో ఉంటూ ఒక మహిళతో సహజీవనం చేస్తున్నాడు. తల్లిదండ్రులు కూలీలుగా జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. అన్నయ్య ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నారాయణ మాత్రం చిన్నతనం నుంచే విలాసాలకు అలవాటుపడి సొమ్ముల కోసం దొంగతనాల బాట పట్టాడు. తనకు 16ఏళ్ల వయసు ఉండగా 2008లో భీమవరం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇనుప ముక్కలు, సైకిళ్ల దొంగతనం చేస్తూ మొదటిసారి పోలీసులకు పట్టుబడి జువైనల్ హోంకు వెళ్లొచ్చాడు. తర్వాత అవనిగడ్డకు చెందిన ఎలమంచిలి కృష్ణతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ దొంగతనాలు చేయడం ప్రారంభించారు. భీమవరం పోలీసులు పట్టుకుని మళ్లీ జువైనల్ హోంకి తరలించారు. అక్కడి నుంచి బయటకు వచ్చిన తర్వాత 2014 నుంచి ఇళ్లలో దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. జైలులో పరిచయం అయిన హైదరాబాద్‌కు చెందిన మంచం శ్రీనివాస్‌తో కలిసి అమలాపురం, పి.గన్నవరం, వీరవాసరం, ఆచంట, ఇరగవరం, పెనుగొండ, పెనుమంట్ర పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలు చేశాడు. దొంగతనాలు చేయడం కోసం ప్రత్యేకంగా ఇనుప రాడ్‌లను తయారు చేయించుకున్నాడు. గతేడాది అక్టోబరు 22న ఆలమూరు పోలీసులు జైలుకు పంపారు. నవంబరు 23న జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఈ నాలుగు నెలల్లో ఉండ్రాజవరంలో 3, సమిశ్రగూడెం 3, పెనుమంట్ర 2, అయినవిల్లి, పెరవలి, రావులపాలెం, భీమడోలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కోటి చొప్పున 12 ఇళ్లను దోచేశాడు. ఈ క్రమంలో గత నెల 11న ఉండ్రాజవరానికి చెందిన సీపాని విజయలక్ష్మీ తన ఇంట్లో దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో నారాయణను నిందితుడిగా గుర్తించి ఈ నెల 8న ఉండ్రాజవరంలో అరెస్టు చేశారు. ఇతడిపై ఇటీవల నమోదైన 12 కేసుల్లో 630గ్రాముల బంగారు ఆభరణాలు, 4కిలోల వెండి వస్తువులు, సుమారు రూ.1లక్ష నగదు, టీవీ, మోటార్ సైకిల్, నేరానికి ఉపయోగించే స్క్రూడ్రైవర్లు, ఇనుప రాడ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. చోరీ సొత్తును ముత్తూట్ వంటి ఫైనాన్స్ కంపెనీల్లో కుదువ పెట్టి ఆ డబ్బులతో క్రికెట్ బెట్టింగ్ ఆడడంతోపాటు విలాసాలకు ఖర్చు చేసేవాడని తెలిపారు. గతంలో నారాయణపై 57 కేసులు ఉన్నాయని, వాటిలో రెండు తీవ్రమైన నేరాలు ఉన్నాయని చెప్పారు. అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) ఎల్.అర్జున్, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, క్లూస్ టీం సీఐ స్వరూప్, ఉండ్రాజవరం, సమిశ్రగూడెం ఎస్ఐలు జి.శ్రీనివాసరావు, కె.వీరబాబు, సీసీఎస్ ఎస్ఐ రవీంద్ర, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

రైళ్లలో దొంగతనాలు

యువకుడి అరెస్ట్

రూ.3.70 లక్షల సొత్తు స్వాధీనం

నిడదవోలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని అరెస్ట్ చేసి బంగారం, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని భీమవరం రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమరాజు తెలిపారు. బుధవారం నిడదవోలు రైల్వే పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో సోమరాజు మాట్లాడుతూ రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న నిడదవోలు మండలం శింగవరం గ్రామానికి చెందిన ఉలవలపూడి దుర్గారావు బుధవారం ఉదయం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుంటే అరెస్ట్ చేశామన్నారు. అతడిని విచారించి వివిధ కేసులకు సంబంధించి 30 గ్రాముల బంగారం, 18 సెల్ ఫోన్లు, సుమారు రూ.3లక్షల 70 వేల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ పి.అప్పారావు, సిబ్బంది ఉన్నారు.



నిడదవోలులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ

270 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్



నిందితుడి వివరాలు తెలుపుతున్న ఎస్పీ

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు పోలీసులు 270కిలోల గంజాయితో వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ వివరాలను బుధవారం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ రాజమహేంద్రవరంలో వెల్లడించారు. హరియాణాలోని సోనిపట్ గ్రామానికి చెందిన మోను సైనీ లారీ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఎన్ఎల్ 01 ఏజే 6162 నెంబరు కలిగిన కంటెయినర్ లారీలో విశాఖపట్నానికి ప్లైవుడ్ లోడు వేసుకుని వచ్చాడు. తిరుగుప్రయాణంలో నర్సీపట్నం ప్రాంతం నుంచి మరో వ్యక్తి అందజేసిన గంజాయి ప్యాకెట్లను డ్రైవరు క్యాబిన్ పైన ఉన్న మరో క్యాబిన్‌లో వేసుకున్నాడు. ఈగల్ బృందానికి వచ్చిన సమాచారంతో బొమ్మూరు పోలీసులను అప్రమత్తం చేశారు. బుధవారం ఉదయం 7 గంటలకు సీఐ పి.కాశీ విశ్వనాథం నేతృత్వంలో వాహన తనిఖీలు చేపట్టారు. సదరు లారీని ఆపి తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించారు. మొత్తం రూ.13.50లక్షలు విలువ చేసే 270కిలోల గంజాయి, లారీని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. లారీలోని అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి సందీప్‌శర్మ ఆచూకీ కోసం గాలిస్తున్నామన్నారు. గంజాయికి సంబంధించి ఎలాంటి సమాచారమైనా పోలీసులకు తెలియజేయాలని, 112కి ఫోన్‌లో కూడా సమాచారం అందించవచ్చని పేర్కొన్నారు. అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, రివార్డు అందిస్తామన్నారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య, సీఐ కాశీ విశ్వనాథం, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

యానాం ఎమ్మెల్యే ఫొటోతో పోస్టులు

మహిళలను మోసం చేసిన రాజమండ్రి యువకుడి అరెస్ట్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యానాం ఎమ్మెల్యే ఫొటోను సామాజిక మాధ్యమాల్లో డీపీగా పెట్టుకుని మహిళలను మోసం చేసిన కేసులో రాజమహేంద్రవరానికి చెందిన ఓ యువకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన జోగాడ వంశీ కృష్ణ, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ గతంలో ఒకే కళాశాలలో చదువుకున్నారు. ప్రస్తుతం వంశీ హైదరాబాద్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడని తెలుస్తోంది. అతడి సోషల్ మీడియా ప్రొఫైల్ పిక్చర్‌గా ఎమ్మెల్యే ఫొటోను పెట్టుకోవడంతో పాటు అతడితో సాన్నిహిత్యంగా ఉన్నట్టు షాదీ.కామ్‌తోపాటు పలు వివాహ సంబంధిత ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో పోస్టులు పెడుతున్నాడు. అలా మోసపోయిన ఓ మహిళ ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి బుధవారం వంశీని అరెస్టు చేశారు. 4రాష్ట్రాల్లో సుమారు 26మంది మహిళలను మాయ మాటలతో నమ్మించి మోసం చేశాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్టు సమాచారం.

మనుమరాలే మోసం చేసింది!

వృద్ధురాలి బంగారం అపహరణ కేసులో మనుమరాలు, మునిమనుమరాలు అరెస్టు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి కళ్లల్లో కారంకొట్టి బంగారం అపహరించిన కేసును పోలీసులు ఛేదించారు. మనుమరాలు, మునిమనుమరాలు ఈ నేరానికి పాల్పడినట్టు గుర్తించి అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం అర్జుననగర్‌లో ఒంటరిగా అద్దెకుంటున్న మండా హైమావతి (72) కళ్లల్లో కారం కొట్టి ఆమె చేతికి ఉన్న రెండు బంగారం గాజులను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బలవంతంగా లాక్కుని వెళ్లిపోయిన ఘటనపై ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కాకినాడ సీసీఎస్, ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఈ నెల 6వ తేదీ రాత్రి జరిగిన దొంగతనంపై నమోదు చేసిన కేసుపై విచారణను వేగవంతం చేశారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, సీసీఎస్ సీఐ కృష్ణ పర్యవేక్షణలో విచారణ చేయగా వృద్ధురాలి మనమరాలైన చెల్లూరు దుర్గాభవాని, ఆమె కుమార్తె కలిసి సదరు దొంగతనం చేసినట్టుగా రుజువైంది. దీంతో వారిద్దరినీ అరెస్టు చేసి దర్యాప్తు నిమిత్తం బంగారం గాజులను స్వాధీనం చేసుకుని భవానీని రిమాండ్‌కు పంపించారు. బాలికను విశాఖపట్నంలోని బాలికల వసతిగృహానికి పంపించినట్టు ఎస్ఐ తెలిపారు.

రెట్టింపు పెట్టుబడి పేరిట దోపిడీ

ఆన్‌లైన్‌లో రూ.8.68 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆండ్రాయిడ్ ఫోను టెలిగ్రామ్‌కు వచ్చిన ఒక లింక్ క్లిక్ చేస్తు మీపెట్టుబడికి రెట్టింపు డబ్బులు వస్తాయని వచ్చిన సందేశాన్ని నమ్మిన ఒక వ్యక్తి పలు దఫాలుగా రూ.8లక్షల 68వేలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామ పరిధిలో మల్లయ్యపేటలో జరిగింది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం... మల్లయ్యపేటకు చెందిన కే.వెంకటేశ్వరావు అనే వ్యక్తి ప్రైవేట్ కంపెనిలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో జనవరి 27న తన ఫోన్‌లో టెలిగ్రామ్‌కు ఒక లింక్ వచ్చింది. దానిని క్లిక్ చేస్తే మీ పెట్టుబడికి రెట్టింపు నగదు వస్తుందని సందేశం రావడంతో దానిని నమ్మిన వెంకటేశ్వరావు తొలుత రూ.40 పెట్టుబడి పెట్టాడు. దానికి రెట్టింపు నగదు వచ్చింది. దీంతో అప్పట్నుంచి డబ్బులు పెట్టుబడి పెట్టుకుంటూ వచ్చాడు. చివరికి అతడు రూ.8 లక్షల 68 వేలు పెట్టుబడి పెట్టి తనకు రావాల్సిన డబ్బులు తన అకౌంట్‌కు బదిలీచేయాలని ఆన్‌లైన్‌లో సందేశం పంపాడు. దానికి అవతలి మోసగాళ్లు ఇంకా రూ.4లక్షలు పెట్టుబడి పెడితే మొత్తం నగదు బదిలీ చేస్తామని అనడంతో అనుమానంవచ్చి బాధితుడు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీరు బాటిల్స్‌తో దాడి చేసిన ముగ్గురి అరెస్ట్

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి బీరు బాటిల్స్‌తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు సర్పవరం ఎస్ఐ పి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. కాకినాడ అర్బన్ కొత్త గైగోలుపాడుకు చెందిన పాలిక రమేష్, దాసరి రాజు, తిమ్మాపురం గ్రామం రాయుడుపాలెం సెంటర్‌కు చెందిన గంజా దుర్గాప్రసాద్ కలిసి ఈ నెల 1వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పాత గైగోలుపాడు పెంకేవారికాలనీలో మద్యం తాగేందుకు వచ్చారు. అక్కడకు మరో ఇద్దరు వచ్చారు. అప్పుడు ఏర్పడిన చిన్నపాటి వివాదం దాడికి దారితీసింది. నిందితులు ఉద్దేశపూర్వకంగా బాధితులపై బీర్ల బాటిల్స్‌తో దాడి చేసి తీవ్ర రక్తస్రావం అయ్యేలా చేశారు. బాధితుల ఫిర్యాదుతో సీఐ బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. ముగ్గురు నిందితులు ఉద్దేశపూర్వకంగానే హింసాత్మక దాడికి పాల్పడినట్టు దర్యాప్తులో తేలిందని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నిందితుడు పరారీలోఉన్నట్టు ఎస్ఐ చెప్పారు.

మద్యం తాగి విధులకు హాజరు... అన్నవరం దేవస్థానం సెక్యూరిటీ గార్డుల తొలగింపు

అన్నవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి విధులకు హాజరైన అన్నవరం దేవస్థానం ఇద్దరు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను విధుల నుంచి తప్పించారు. భద్రతా చర్యల కట్టుదిట్టంలో భాగంగా సెక్యూరిటీ గార్డులకు విధులకు హాజరయ్యే సమయంలో బ్రీత్‌ఎనలైజర్ టెస్టులు చేయగా బుధవారం ఇద్దరు పట్టుబడ్డారు. ఇటీవల దేవస్థానం ట్రాన్స్‌పోర్టులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఈ విధంగా పట్టుబడగా అతడిపై చర్యలు తీసుకున్నారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి

రాజానగరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నామవరం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శాటిలైట్‌సిటీకి చెందిన మల్లమంతి సుధీర్ (23) మృతి చెందాడని రాజానగరం సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. వివరాల ప్రకారం.. శాటిలైట్ సిటీ నుంచి నామవరం వైపు బైక్‌పై వెళ్తున్న సుధీర్‌ను శాటిలైట్‌సిటీ వైపునకు వస్తున్న మరో వ్యక్తి బైక్ ఢీకొనడంతో మృతిచెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

రైలు నుంచి జారి పడి...



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్ఐ

తుని రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. ఉల్లిపాడు- నర్సీపట్నం రైల్వేస్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తూ రైలు నుంచి 45 ఏళ్ల వ్యక్తి జారిపడినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఏ ఆధారాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచినట్టు ఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు తుని రైల్వే స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

బాల్య వివాహాలు నిరోధించడానికి విస్తృతస్థాయిలో
అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

● డీఆర్‌వో సీతారామమూర్తి

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు నిరోధించడానికి విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి అన్నారు. బుధవారం అమరావతి నుంచి రాష్ట్ర మహి ళాశిశు సంక్షేమ సంచాలకుడు ఎం.వేణుగోపాల్‌రెడ్డి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌కు స్థానిక కలెక్టరేట్ నుంచి డీఆర్‌వో ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా బాల్యవివాహాలు నిరోధించడానికి చేపట్టిన ప్రణాళికపై పలు సూచనలు చేశారు. బాల్యవివాహాలు నిరోధించడానికి గ్రామ, మండలం, పట్టణంలో తహసీల్దార్ల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈనెల 30న అక్షయ తృతీయ రోజున బాల్యవివాహాలు జరిగే అవకాశం ఉందని వాటిని సమర్థవంతంగా నిరోధించడంకోసం క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని కోరారు. సీడీపీవో, సీడ బ్ల్యుసీ, సీడబ్ల్యుపీవో, ఏడబ్ల్యుడబ్ల్యుఎస్‌లు ప్రత్యేక దృషిపెట్టాలని కోరారు. అదేవిదంగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం 2017 లోని రూల్ 2బి(2) ప్రకారం పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలకు సమాచారం లేకుండా పాఠశాల నుంచి గైర్హాజర్ అయిన పిల్లల జాబితాను సిద్ధంచేయాలని సూచించారు. ఈ జాబితాను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సిద్ధంచేసి జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్, బాల్యవివాహ నిషేధ అధికారికి అందజేయాలని సూచించారు. బాల్యవివాహాల సమాచారం తెలిసిన వారు మహిళా శిశుసంక్షేమశాఖ హెల్ప్ లైన్ 18004255041, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, మహిళా హెల్ప్‌లైన్ 1091కు సమాచారం అందించాలని సూచించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి, జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు, ఎస్ఎస్‌పీడీ ఎస్.సుభాషిణి, సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ఎం వలి, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

రాజమహేంద్రవరంఅర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లావణ్య డిమాండ్ చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలోని క్వారీ మార్కెట్ సెంటర్లో గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు మధ్యలో కట్టెలతో పొయ్యి వెలిగించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ సామాన్య, పేదప్రజలు వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్‌పై ఒక్కసారిగా రూ.50లు పెంచడంవల్ల ఆయా కుటుంబాలపై అదనపు భారం పడుతుందని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కొండావతి, మహిళా నాయకులు మంగ భారతి, సుజాతమ్మ, అప్పాయమ్మ పాల్గొన్నారు.

● ఏపీ మహిళా సమాఖ్య నిరసన

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నిరసన

కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కమిటీ కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మావోభవన్‌లో పార్టీ కేడర్‌తో కలిసి నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి భీమశంకర్, పీడీఎస్‌యూ నాయకులు భాను, దినేష్, రోహిత పాల్గొన్నారు.

రుణాల ఎంపిక ఇంటర్వ్యూలకు 386 మంది హాజరు

అనపర్తి ఏప్రియల్ 9 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఈబ్ల్యూఎస్ రుణాల కోసం అధికారులు బ్యాంకర్లు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 386మంది హాజరైనట్లు ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. వివిధ కార్పొరేషన్ రుణాల కోసం 454మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా 386మంది మాత్రమే హాజరయ్యారని ఆయన తెలిపారు.



గ్యాస్ ధరల పెంపుపై చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్

గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలి

● సీపీఎం నిరసన

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం రాజమహేంద్రవరంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపట్టామన్నారు. ధరలు తగ్గించే వరకూ ఆందోళనలు కొనసాగిస్తామని, గ్యాస్ ధరలతోపాటు ఇతర అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల నెత్తిన భారాలు మోపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, పూర్ణిమరాజు, నగర కమిటీ నాయకులు రాంబాబు, భాస్కర్, అశోక్ పాల్గొన్నారు.

రోడ్డు కం రైలు వంతెన మార్గాన్ని తీర్చిదిద్దాలి

● పరిశీలనలో కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో వాహనాల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రోడ్డుకం రైలు వంతెన నుంచి కోటిపల్లిబస్టాండ్ ఎన్టీఆర్ విగ్రహం వరకు ఉన్న రోడ్డును తీర్చిదిద్దాలని రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆ రోడ్డును ఆయన పరిశీలించారు. రహదారి అభివృద్ధి విషయంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం 80 అడుగులకు రోడ్డును విస్తరించాల్సి ఉందన్నారు. ఈ మేరకు అవసరమైన టీడీఆర్‌లు ఒక వారంలో ఇవ్వడానికి సిదం చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంరూరల్ మండలం బొమ్మూరు నేతాజీనగర్ నుంచి ఒక బాలిక అదృశ్యమైందని బొమ్మూరు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే గొల్లప్రోలు మండలానికి చెందిన 17 ఏళ్ల బాలికి తన అమ్మమ్మవాళ్ల ఇంటికి బొమ్మూరు నేతాజీ నగర్‌కు వచ్చింది. ఈనెల 8న ఇంట్లో ఎవ్వరూ లేని సమయం చూసి బట్టలు సర్దుకుని ఇంటి నుంచి బయటకువెళ్లిపోయింది. అటుపై బాలిక అమ్మమ్మ చూసుకుంటే కనిపించలేదు. దీంతో బాలిక తల్లి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీగౌతమి స్మార్ట్ స్కూల్ వార్షికోత్సవాల సందర్భంగా 5,6వ తరగతుల విద్యార్థులు కలర్స్ ఆఫ్ క్రియేటివిటీ-జర్నీ ఆఫ్ డ్రీమ్స్-2025ని బుధవారం నిర్వహించారు. దీనికి డెల్టా ఆస్పత్రిలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న, స్కూల్ పూర్వ విద్యార్థి డాక్టర్ నితిన్ రిమ్మలపూడి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సామర్థ్యాలు, సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి కార్య క్రమాలు ఉపకరిస్తాయన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే ఉద్దేశంతో ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకూ సాంస్కృతిక కార్యక్రమాలను తరగతుల వారీగా నిర్వహిస్తున్నామని సంస్థ డైరెక్టర్ సుంకర రవికుమార్ చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుంకర మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు నాయకులుగా తయారు కావాలి

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ జెండా మోసిన ప్రతీ కార్యకర్త నాయకుడిగా ఎదగాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం నగర టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక జేఎన్ రోడ్డు వి కన్వెన్షన్ హాలులో టీడీపీ కార్యకర్తలకు రాజకీయ శిక్షణా తరగతులు బుధవారం నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, ఏపీ శెట్టిబలిజ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, ఆర్యాపురంఅర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావులు హాజరయ్యారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా శిక్షణా తరగతుల ప్రారంభంలో ఆదిరెడ్డి వాసు మాట్లాడారు. టీడీపీ పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీఅన్నారు. తమ పార్టీలో జెండా పట్టుకుని కష్టపడిన ప్రతీ కార్యకర్తకు అన్ని విషయాలపట్ల అవగాహన కలిగిన నాయకుడిగా ఎదిగేలా రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లు నిబద్దతతో క్రమశిక్షణతో పార్టీని ముందుకు తీసుకువెళ్తున్నారని కష్టపడిన ప్రతీ కార్యకర్త ఒక నాయకుడిగా ఎదగాలని ప్రపంచీకరణ, ఆధునిక సమాజం, పరిణామాలు, టెక్నాలజీ, విషయపరిజ్ఞానంపై కార్యకర్తలు పట్టుసాధించాలనే శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. మన నడవడిక, తీరుతెన్నులు ప్రజలు నిత్యం గమనిస్తుంటారని పదవులతో గర్వం తలకెక్కితే ఆ పదవులు ఇచ్చిన ప్రజలే వాటి నుంచి కిందకి దింపుతారని తమ నేత సీఎం చంద్రబాబు అంటుంటారని అందుకే సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లని తమ పార్టీ వ్యవస్థాపకుడు దివంగత సీఎం ఎన్టీఆర్ నినాదంతోనే పార్టీని చంద్రబాబు ముందుకు నడిపిస్తున్నారని చెప్పారు. రాజమండ్రిలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న ఈశిక్షణా తరగతులు ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం గన్నికృష్ణ మాట్లాడుతూ కార్యకర్తల కోసం రాజకీయ శిక్షణా తరగతులు ఏర్పాటు చేసిన ఆదిరెడ్డి వాసుకుఅభినందనలు తెలిపారు. అనంతరం మోటివేషన్ స్పీకర్స్‌కౌన్సిలింగ్ సైకాలజిస్టులు డాక్టర్ గడ్డం కళాంజలి, దారపు నాగిరెడ్డి, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ళ సుబ్బారావులు సమాజంలో కీలకంగా వ్యవహరించే అంశాలు వాటిని అవగాహన చేసుకుని ఏవిధంగా వ్యవహరించాలి, నాయకుడుకు ఉండాల్సిన అర్హతలు, ప్రజలతో ఎలా వ్యవహరించాలి, చట్టాలు, అన్నింటిపైన పూర్తిస్థాయిలో శిక్షన తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, టీడీపీనగర ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, మాటూరి సిద్దు, టీడీపీ నాయకులు కొయ్యల రమణ, కడలి రామకృష్ణ, దాస్యం ప్రసాద్, బుడ్డిగ రవి, చాపల చిన్నరాజు, మళ్ళ వెంకట్రాజు ,తెలుగు మహిళ పార్లమెంట్ కమిటి అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, వెలుగు కుమారి, నిర్మల, సత్యరమణి, పద్మ, నాగమణి, కృపామణి, కూరాకుత తులసి, మోతా నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేసి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు గడువు పెంపు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ కోసం దరఖాస్తు గడువు ఈనెల 18వ తేదీ వరకూ పొడిగించినట్టు జిల్లా బీసీ సంక్షేమాధికారిణి బి.శశాంక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు ఈ ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోచ్చని తెలిపారు. టెట్ పరీక్షలో అర్హత సాధించిన తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారికి మాత్రమే ఈ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇస్తామని తెలిపారు. దరఖాస్తులను అవసరమైన అన్ని పత్రాలతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమీపంలోని బీసీ స్టడీసర్కిల్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

'చంద్ర రాజేశ్వరరావు జీవితాన్ని ప్రజల్లోకి తీసుకెళతాం'

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) :ఆదర్శ కమ్యూనిస్టు దివంగత చంద్ర రాజేశ్వరరావు జీవితాన్ని ప్రజల్లోకి తీసుకెళతామని, దీనిద్వారా పార్టీ నిర్మాణాన్ని పెంచుకుంటామని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, నగర సహాయ కార్యదర్శి సప్ప రమణ, టౌన్ కమిటీ సభ్యులు నల్ల రామారావు, ఏపీ మహిళా సమాఖ్య పి.లావణ్య, నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అశాంతిని సృష్టిస్తున్న జగన్

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ

రాజమహేంద్రవరం సిటీ ఏప్రిల్ 9(ఆంధ్ర జ్యోతి): మాజీ సీఎం జగన్ పరామర్శల పేరుతో రాష్ట్రంలో అశాంతి అలజడి సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పరామర్శలకు వెళ్లిన జగన్ పోలీసులను బట్టలూడదీసి కొడతామని జగన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

● ఎమ్మెల్సీ సోముకు అభినందన

ఇటీవల ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసి నగరానికి వచ్చిన బీజేపీ నేత సోమువీర్రాజుకు గన్నికృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కొద్దిసేపు రాజకీయాలపై వా రు చర్చించుకున్నారు. రెండుసార్లు సోముకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం అభినందనీయమని గన్ని అన్నారు.

ఈవోపీఆర్డీని డిప్యూటీ ఎంపీడీవోగా మార్పు

రంగంపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారులు గత దశా బ్ద కాలంగా ఎదురుచూస్తున్న డిప్యూటీ ఎంపీడీవో పేరు మార్పు నేటి కూటమి ప్రభుత్వ నిర్ణయంతో సాకారమైంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విస్తరణాధికార్ల సంఘం వారు రాష్ట్ర సీఎం ఎన్.చంద్రబాబు, డిప్యూటీ సీఎం కె.పవన్‌కళ్యాణ్, పంచాయతీరాజ్ కమిషనర్ ఎం. కృష్ణతేజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారని రంగంపేట మండల ఈవోపీఆర్డీ పి.వెంకటరత్నం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ధవళేశ్వరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రాజానగరం మండలం జి.యర్రంపాలెం గ్రామానికి చెందిన ఎన్.శ్రీను (50)బుధవారం ఉదయం తణుకులోని బంధువుల ఇంటి వద్ద నుంచి మోపెడ్‌పై ప్రయాణిస్తూ ధవళేశ్వరం హైవేపై హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపంలోకి వచ్చే సరికి వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో శ్రీను రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు 108 అంబులెన్స్‌లో గాయపడిన శ్రీనును ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గట్టి కుటుంబానికి ప్రముఖుల పరామర్శ


గట్టి సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

కడియం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ నుంచి డీసీసీబీ డైరెక్టర్ వంటి అనేక పదవులు చేపట్టిన గట్టి సత్యనారాయణ (90) మృతి తీరనిలోటని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. పితృ వియోగంతో బాధపడుతున్న ఆయన కుమారులు మాజీ సర్పంచ్ గట్టి నర్సయ్య, కూటమి నాయకులు గట్టి సుబ్బారావు సోదరులను పలువురు పరామర్శించారు. గట్టి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీకాకుళపు శివరామసుబ్రహణ్యం, మాజీ ఎంపీలు గిరజాల వెంకటస్వామినాయుడు, మార్గాని భరత్‌రామ్, మాజీ ఎంపీపీలు పాటంశెట్టి సూర్యచంద్రరావు, మార్గాని లక్ష్మీసత్యనారాయణ, కాగిత సత్యభారతి, ప్రముఖ నర్సరీ రైతు గంగుమళ్ళ సత్యనారాయణ, పంతం చారిటబుల్ ట్రస్ట్ పంతం కొండలరావు, నర్సరీ సంఘ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, మాజీ సర్పంచ్‌లు పుల్లా రామారావు, సాపిరెడ్డి సూరిబాబు, జనసేన నాయకులు పాటంశెట్టి రవి, మార్గాని ఏడుకొండలు, పుల్లా శ్రీను, గెడ్డం శివ, బీజేపీ నాయకులు బొర్సు సుబ్రహ్మణ్యం, ఆకుల శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు టీ కే విశ్వేశ్వరరెడ్డి, తాడాల కొండ్రాజు, బాలేపల్లి మురళీధర్, వైసీపీ నాయకులు చందన నాగేశ్వర్, రావిపాటి రామచంద్రరావు, తిరుమలశెట్టి శ్రీను, తాడాల చక్రవర్తి, గోపాలం, నర్సరీరైతులు పరామర్శించారు.

ప్యాకింగ్ పరిశ్రమలో ఉపాధి అవకాశాలు మెండు

రాజానగరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్యాకింగ్ పరిశ్రమలో ఉద్యోగావకాశాలకు కొదవలేదని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంటర్వ్యూలను సమర్థవంతంగా ఎదుర్కొంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలు సాధించవచ్చని హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.నటరాజ్ అన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయు)లోని బీటెక్ అగ్రికల్చర్, గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు ప్యాకింగ్ ఫర్ మెడికల్ డివైసెస్ అనే అంశంపై బుధవారం ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించా రు. ఈసందర్భంగా నటరాజ్ మాట్లాడుతూ ప్యాకింగ్ పరిశ్రమ ఎంతో అద్భుతమైందన్నారు. ఏ ఉత్పత్తులైనా ప్యాకింగ్ లేకుండా మార్కెట్లోకి వెలువడదన్నారు. తయారీదారుకు వినియోగదారునికి మధ్య ప్యాకింగ్ ఒక వారధిగా మారిందన్నారు. అనంతరం ముఖ్యఅతిథి నటరాజ్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈకార్యక్రమంలో జీజీయు ప్రోఛాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.డి.ధనరాజు, వైస్ ప్రిన్సిపాల్ రామచంద్రన్, జీజీయు వ్యవసాయ విభాగాధిపతి బి.బలరాం భగత్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్లకు శంకుస్థాపన


బలభద్రపురంలో సీసీ రోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలభద్రపురం, కాపవరం, తొస్సిపూడి, పందలపాక గ్రామాల్లో ఉపాధిహామీ, పంచాయతీ జనరల్ ఫండ్స్ రూ.1.20లక్షలతో నిర్మించిన 17 సీసీ రోడ్లు, డ్రైయిన్లను ప్రారంభించి, రూ.1.45 కోట్లతో నిర్మించనున్న రోడ్లు, డ్రైయిన్లకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. బలభద్రపురం రైతుసేవా కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ఐటీసీ నిధులు రూ.6.50 లక్షలతో అభివృద్ధి చేసిన మోడల్ అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈకార్యక్రమాల్లో ఎంపీపీ తేతలి సుమ, కూటమి నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, రావాడ నాగు, పడాల రాము, ఇందల వీరబాబు, కొట్టు సత్తిబాబు, తేతలి సూర్యచంద్ర, పడాల చినబుజ్జి, పడాల సూర్యనారాయణరెడ్డి, గుణ్ణం శ్రీనివాసచౌదరి, చిన్నం వీర్రాఘవరెడ్డి, మల్లిడి అబ్బాయిరెడ్డి, కాటే సింహాచలం, అనుసూరి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు సబ్బారపు పద్మావతి, బుంగా రామారావు, కొవ్వూరి సీతారత్నం, తహశిల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో వి.శ్రీనివాస్, ఏఈ పి.రామిరెడ్డి, ఏపీఓ అగస్టీన్‌కుమార్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తున్నాం

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నామని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజానగరం మండలం తోకాడలో రూ.4కోట్ల60 లక్షలతో తోకాడ నుంచి చక్రద్వారబంధం వరకూ (వయారాధేయపాలెంరోడ్డు) నిర్మితమయ్యే సిమ్మెంట్‌రోడ్‌కు, శ్రీరాంపురం నుంచి భూపాలపట్నం వరకూ రూ.2కోట్లతో నిర్మించే సీసీ రోడ్డుకు శ్రీరాంపురంలోనూ రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరితో కలిసి ఎమ్మెల్యే బత్తుల బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ దీంతోపాటు కోరుకొండ, సీతానగరం మండలాల్లో కూడా రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్నామని చెప్పారు. రెండునెలల వ్యవధిలో ఈ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రస్తుత వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మధ్యలో నిలిపివేసిన ఆర్‌అండ్‌బీ రహదారుల పనులను ఈనెల 15 నుంచి 20వ తేదీ మధ్య ప్రారంభిస్తామన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని అన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రూ26.60 కోట్లతో మండలానికి రెండు వంతున రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో రహదారి పనులకు నేడు శంకుస్థాపన చేస్తున్నామన్నారు. ఏ నియోజకవర్గంలో లేనివిధంగా రాజానగరం నియోజకవర్గానికి నిధులు తీసుకురావడానికి ఎమ్మెల్యే బత్తుల చేస్తున్న కృషిని తాము అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజానగరం ఎంపీడీవో జె.ఎ. ఝాన్సీ, తహసీల్దార్ జీఎవిఎస్ దేవి, పంచాయతీరాజ్ డీఈ దుర్గాప్రసాద్, ఏఈ సంపత్‌కుమార్, టీడీపీ నాయకులు పెందుర్తి అభిరామ్, గంగిశెట్టి చంటిబాబు, జనసేన నావంతు కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, వై.శ్రీనివాస్, అడబాలగణపతిరావు, గంగిశెట్టి చంటిబాబు, తోటరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ జీవీఆర్ చౌదరి

రూ.2.40కోట్లతో కోటి-కేశవరం రోడ్ల పనులకు శంకుస్థాపన

కోరుకొండ/సీతానగరం, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి):మండలం కోటికేశవరం, కోటి గ్రామాలను అనుసంధానంచేసే లింకు రోడ్లను ఉపాధి హామీ పథకం ద్వారా రూ.2.40కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో ఎన్నో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రోడ్లను కూటమిప్రభుత్వం వచ్చిన 9నెలల్లోనే అభివృద్ధి చేశామన్నారు. ఇప్పటికే గాదరాడ, కణుపూరు మధ్య రోడ్లు, పందరాడ, గాదరాడ రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు. ఇప్పుడుకొత్తగా కోటి-కోటికేశరం, మునగాల-శ్రీరంగపట్నం రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. ఇప్పటికే గోకాడ-శ్రీరాంపురం, సీతానగరం, వరదేవపురం, ముగ్గళ్ళ, పురుషోత్తపట్నం, సీతానగరం, సింగవరం రోడ్లను సీసీరోడ్లుగా అభి వృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు యర్నాకుల శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్‌బత్తుల వెంకటలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, తనయుడు పెందుర్తి అభి రామ్, ఎంపీడీవో బత్తిన అశోక్‌కుమార్, తహసీల్దార్ సుస్వాగతం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రాసిమ్ ఇండస్ట్రీ, బలభద్రపురం క్యాన్సర్ అంశాలపై
మాజీ ఎమ్మెల్యే బహిరంగ చర్చకు సిద్ధమా

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఏప్రియల్ 9 (ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలో కాలుష్యం వెదజల్లుతున్న గ్రాసిమ్ ఇండస్ట్రీ, బలభద్రపురంలో క్యాన్సర్ బాధితుల పైనా అవాస్తవాలు మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాజీ ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. బుధవారం రామవరంలోని ఎన్డీయే కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మాజీ ఎమ్మెల్యే ప్రెస్‌మీట్ పేరుతో విడుదల చేస్తున్న వీడియోలలో అనేక ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గ్రాసిమ్ ఇండస్ట్రీ నుంచి ముడుపులు కోసం అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని ఆయన అనడం సమంజసంగా లేదని అన్నారు. అదేవిధంగా బలభద్రపురంలో క్యాన్సర్ విజృంభిస్తున్నప్పటికీ క్యాన్సర్ కేసులు సగటుకన్నా తక్కువగా ఉన్నాయని చెప్పడం సరికాదని ఒక వైద్యుడిగా ఉండి ఇటువంటి ప్రకటనలు చేయడం సిగ్గుచేటన్నారు. సమస్య తీవ్రతపై బహిరంగంగా చర్చిద్దామని మీరు నలుగురు వైద్యులను తీసుకుని చర్చకు రావచ్చని నేను ఒక్కడినే చర్చలో పాల్గొంటానని అన్నారు. రామవరంలో పేకాట క్లబ్బులంటూ ఆరోపణలు చేస్తున్నారని నిరూపించలేని ఆరోపణలు చేయడం అర్థరహితమని అన్నారు. కేవలం ఏదో మాట్లాడాలని మాజీ ఎమ్మెల్యే స్క్రిప్టులు రాయించుకుని చదువుతున్నారని అన్నారు. బిక్కవోలు ఎంపీపీ పదవిపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని సొంత ఎంపీటీసీలే చీకొట్టి వెళ్లినా బుద్ధిరావడం లేదన్నారు.

జాబ్‌మేళాలో 32 మంది ఎంపిక


రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 32 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు అర్హత సాధించారు. కళాశాల వివేకవర్ధని సెమినార్ హాలులో ఈ జాబ్‌మేళా నిర్వహించినట్లు కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ జి.శరత్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారులు పీవీబీ సంజీవరావు, ఎమ్మెస్ ఫణికుమార్, ఎం.లలితరమ్య, డి.మధులత పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు నియామకపత్రాలు అందజేశారు.

ముగ్గుళ్ళ ఇసుక ర్యాంపుకు అనుమతి లేదు: తహసీల్దార్

సీతానగరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ముగ్గుళ్ళ ఇసుక ర్యాంపు మాదే బయట గ్రామాలను రానివ్వమంటూ ముగ్గుళ్ళ గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు అతి చేయడంతో బుధవారం రఘుదేవపురం ముగ్గుళ్ళ గ్రామాల ట్రాక్టర్ డ్రైవర్లకు గొడవ జరిగింది. దీంతో 3 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండలంలో కాటవరం, వంగలపూడి రీచ్‌లకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. ముగ్గుళ్ళ ర్యాంపుకు అనుమతి లేదు. కాగా ముగ్గుళ్ళ గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ముగ్గుళ్ల ర్యాంపు ముగ్గుళ్ళ గ్రామస్తులదే అని బయట గ్రామాలకు ఇక్కడ తావు లేదంటూ అతి చేస్తున్నారు. ఈ నెపంతో ట్రాక్టరుకు 800 నుంచి 1000/-లు వరకు వసూళ్లు చేస్తున్నారు సొమ్ములు కడితేనే బయటివారికి అనుమతిస్తున్నారు. నిర్భయంగా ఉచిత ఇసుక పేరుతో ఇసుక అమ్ముకుంటుంటే అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. దీంతో తరచూ ర్యాంపు వద్ద గొడవలు జరుగుతున్నాయి. వంగలపూడి ర్యాంపు వద్ద రెవెన్యూ వారి కాపలా ఉన్నప్పటికి ఇలా జరగడం విశేషం. ఈ విషయమై తహసీల్దార్ ఎ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ముగ్గుళ్ళ ఇసుక ర్యాంపుకు అనుమతి లేదని తెలిపారు







దారుణం!

- బాలబాలికలపై వృద్ధుడి లైంగిక చర్యలు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసు విచారణ
- పోక్సో కేసు.. పోలీసుల అదుపులో నిందితుడు
- అతడికి హెచ్ఐవీ ఉండడంతో ఆందోళన
- తొమ్మిది మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

8

మూడు జిల్లాలకు గోదావరి జలాలు

- రూ.1400 కోట్లతో వాడపల్లి బంగారమ్మ పేట వద్ద హెడ్‌వర్క్స్ ఏర్పాటు
- కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

8



మహిళల వినూత్న నిరసన

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి : ఏపీ మహిళా సమాఖ్య నిరసన

రాజమహేంద్రవరంఅర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లావణ్య డిమాండ్ చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలోని క్వారీ మార్కెట్ సెంటర్లో గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు మధ్యలో కట్టెలతో పొయ్యి వెలిగించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ సామాన్య, పేదప్రజలు వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్‌పై ఒక్కసారిగా రూ.50 పెంచడం వల్ల ఆయా కుటుంబాలపై అదనపు భారం పడుతుందని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కొండావతి, మహిళా నాయకులు మంగ భారతి, సుజాతమ్మ, అప్పాయమ్మ పాల్గొన్నారు. కాగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ నగర కమిటీ కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మావో భవన్‌లో పార్టీ కేడర్‌తో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రుణం.. రణం!

- ప్రజాప్రతినిధులకు 'సవాల్'గా మారిన కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక
- ఉమ్మడి జిల్లాలో బీసీ, కాపు కార్పొరేషన్లకు 7,303 యూనిట్లు మంజూరు
- అందిన దరఖాస్తులు 1,11,038.. అర్హత సాధించిన వారు స్వల్పమే
- లబ్ధిదారులకు షాక్ ఇస్తున్న బ్యాంకులు.. రుణాల కోసం ఎమ్మెల్యేలపై ఒత్తిడి
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దరఖాస్తుదారులు





ఇటీవల బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ సామాజికవర్గాల వారికి రుణాల పంపిణీ కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్లకంటే 15 రెట్లు అధికంగా దరఖాస్తులు పోటెత్తాయి. దాంతో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికార యంత్రాంగం అష్టకష్టాలు పడుతోంది. మరోవైపు దరఖాస్తుదారుల ఒత్తిడితో అర్హులైన లబ్ధిదారులను సిఫారసు చేసేందుకు ఎమ్మెల్యేలు సైతం ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో బీసీ, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్ కింద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ కార్పొరేషన్లకు సంబంధించి 7,303 యూనిట్లు మంజూరు కాగా వాటికోసం 15 రెట్లు అధికంగా అంటే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లక్షా 11వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిని ఆయా పట్టణాలు, కార్పొరేషన్లు, మండలాల వారీగా ఇటీవల అధికారులు ఇంటర్వ్యూలకు పిలిచి రుణాలకు అర్హులైన లబ్ధిదారుల అన్వేషణలో పడ్డారు. ఈ దశలోనే రాజకీయ ఒత్తిళ్లతో రుణాలు తమకే మంజూరు చేయాలంటూ పట్టణ, మండల స్థాయి ప్రజాప్రతినిధుల ద్వారా అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, మరికొందరైతే మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సుల పేరుతో రుణ మంజూరు కోసం పైరవీలు చేస్తున్నారు. ఈ పరిణామాలు ప్రస్తుతం కూటమి ప్రజాప్రతినిధులకు ప్రాణసంకటంగా మారింది. ఎవరిని నొప్పించినా రానున్న రోజుల్లో పరిస్థితులు ఇబ్బందికరంగా మారుతాయనే ఆందోళన వారిలో కనిపిస్తోంది.

దరఖాస్తుదారులు 15 రెట్లు అధికం..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో 7,303 యూనిట్లకుగాను మొత్తం 1,11,038 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో బీసీ కార్పొరేషన్ ద్వారా 63,412 మంది. కాపు కార్పొరేషన్ల ద్వారా 45,290, ఈడబ్ల్యుఎస్ కింద 2336 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వాటన్నింటినీ ఆయా కార్పొరేషన్‌కు చెందిన అధికారులు విశ్లేషించి అభ్యర్థులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాటిలో భాగంగా బీసీ కార్పొరేషన్ రుణాల కోసం కాకినాడ జిల్లాలో 1,895 యూనిట్లకోసం 31,856 మంది దరఖాస్తు చేశారు. వారిలో ఆయా మండలాలకు చెందిన అధికారులు 777 మందిని ఎంపిక చేయగా 245 మందికి రుణాలు ఇచ్చేందుకు ప్రస్తుతం బ్యాంకర్లు అంగీకరించారు. అదే విధంగా కాపు కార్పొరేషన్ కోసం 775 యూనిట్ల కోసం 21,455 మంది దరఖాస్తు చేయగా వారిలో 390 మందిని అధికారులు ఎంపిక చేశారు. 106 మందికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారు. అదేవిధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బీసీ కార్పొరేషన్‌కు 1,366 రుణాలు లక్ష్యం కాగా 15,148 మంది దరఖాస్తు చేశారు. వారిలో మండలస్థాయిలో అధికారులు 399 మందిని ఎంపిక చేయగా కేవలం 22 మంది లబ్ధిదారులకు మాత్రమే రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించాయి. అదేవిధంగా కాపు కార్పొరేషన్ ద్వారా 756 యూనిట్ల లక్ష్యం కాగా 15,643 మంది దరఖాస్తు చేశారు. మండలస్థాయి అధికారులు ఇప్పటివరకు 343 మందిని ఎంపిక చేశారు. కేవలం 16 మందికే బ్యాంకులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. తూర్పుగోదావరికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా 1,341 యూనిట్లు లక్ష్యంగా కాగా ఇందుకోసం 16,408 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో అధికారులు 243 మందిని ఎంపిక చేయగా బ్యాంకులు మాత్రం 23 మంది లబ్ధిదారులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. కాపు కార్పొరేషన్ ద్వారా 758 యూనిట్ల లక్ష్యం కాగా 8,192 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వీరిలో 174 మందిని అధికారులు ఎంపిక చేయగా కేవలం తొమ్మిది మందికి మాత్రమే ఇప్పటికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించాయి.

ఎమ్మెల్యేలకు శిరోభారం..

బీసీ, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్ రుణాలకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలపై తీవ్ర ఒత్తిడి ప్రారంభమైంది. తమ వారికే రుణాలు మంజూరుచేసేలా సిఫార్సులు చేయాలంటూ లబ్ధిదారులను వెంటేసుకుని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు వారి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నాయని, మేము పెట్టుకున్న లోన్లు మంజూరు చేయకపోతే గ్రామాల్లో పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాల్సి వస్తుందంటూ కొందరు పరోక్ష హెచ్చరికలు చేస్తున్నారు. అయితే రుణాల మంజూరులో గానీ, లబ్ధిదారుల ఎంపికలో గానీ తమ ప్రమేయం ఏమీ ఉండదని, అభ్యర్థుల అర్హతలు, వారు పెట్టుకునే వ్యాపారాలకు సంబంధించి యూనిట్లు, బ్యాంకుల్లో వారికి ఉన్న సిబిల్ స్కోర్ వంటి వాటిని పరిగణలోకి తీసుకుని కార్పొరేషన్ అధికారులు రుణాలు మంజూరు చేస్తారని ప్రజాప్రతినిధులు నచ్చచెబుతున్నారు. ఇక దరఖాస్తుల సమయంలో ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా ఇప్పుడు వార్డుకు ఒకటి, గ్రామానికి ఒకటి లోన్లు ఇస్తే ఎలాగంటూ నేతలు తలలుపట్టుకుంటున్నారు.

బీసీ రుణాలు.. సబ్సిడీలు..

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

బీసీలకు ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంక్ రుణాలతో ఈ సహాయం అందుతుంది. యూనిట్ విలువ రూ.2 లక్షల వరకూ ఉంటే సబ్సిడీ 50 శాతం లేదా, రూ.75 వేలు మించకుండా ఉంటుంది. యూనిట్ కాస్ట్ రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకూ ఉంటే 50 శాతం లేదా, రూ.1,25,000వరకూ సబ్సిడీ ఉంటుంది. రూ.3 లక్షల నుంచి 5లక్షల వరకూ యూనిట్ విలువ ఉంటే, సబ్సిడీ రూ.2 లక్షల వరకూ ఉంటుంది. జనరిక్ మెడికల్ షాపులకు కూడా రుణాలు ఇస్తున్నారు. రూ.8 లక్షల విలువ ఉంటే రూ.4 లక్షలు సబ్సిడీ లభిస్తోంది. మేదర, కుమ్మర శాలివాహన వారికి బుట్టల అల్లకం, కుండల తయారీకి రుణమిస్తారు. యూనిట్ కాస్ట్ రూ.3 లక్షలుంటే రూ.1.5 లక్షల సబ్సిడీ ఉంటుంది. మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజస్ పథకం కింద రూ.25 లక్షల వరకూ యూనిట్ విలువ ఉంటుంది. ఇందులో రూ.10 లక్షలు సబ్సిడీ, రూ.10 లక్షలు బ్యాంక్ రుణం, రూ.5 లక్షలు లబ్ధిదారుడి వాటా.

ఆదాయం డీలా..

- లక్ష్యం రూ.701కోట్లు.. రాబడి రూ.472 కోట్లు
- రూ.299 కోట్లు తగ్గుదల
- డాక్యుమెంట్ల సంఖ్యలోనూ తగ్గుదల



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గడిచిన ఆర్థిక సంవత్సరం రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం జిల్లాలో లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. అంతకు ముందు ఏడాదితో పోల్చినా తక్కువగానే రాబడి సమకూరింది. వాస్తవానికి గత ఏడాది నవంబరు నుంచీ రిజిస్ట్రేషన్లు నెమ్మదిస్తూ వచ్చాయి. అయినప్పటికీ సరైన దిద్దుబాటు చర్యలు కొరవడడం, మరోవైపు రియల్ ఎస్టేట్ పడకేయడం వెరసి రిజిస్ట్రేషన్ల ఆదాయం లక్ష్యానికి 32 శాతం దూరంలో ఆగిపోయింది. జిల్లాలో రిజిస్ట్రేషన్ల ఆదాయంలో ముందు వరుసలో ఉండే రాజమహేంద్రవరం, రాజానగరం, కడియం, పిడింగొయ్యి కూడా నిరాశపరచగా అనంతపల్లి కాస్త మెరుగ్గా 92శాతం టార్గెట్ పూర్తిచేసింది.

రాబడికి గండి

తొలుత 2023-24 ఆర్థిక ఏడాదితో పోలిస్తే 2024-25 ఆదాయం కాస్త మెరుగైనా లక్ష్యానికి మాత్రం చాలా దూరంలోనే ఉంది. అనంతపల్లి మినహా ఏ రిజిస్ట్రారు కార్యాలయమూ 80 శాతానికి చేరువకాలేదు. ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో మాత్రం డాక్యుమెంట్ల సంఖ్యలోనూ అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే భారీగా తగ్గుదల నమోదైంది. 2023-24, 2024-25కి ఏకంగా లక్ష డాక్యుమెంట్లు తగ్గాయి. 2024-25కి వచ్చేసరికి రూ.701కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా కేవలం రూ.472కోట్లు మాత్రమే ఖజానాకు చేరింది. రూ.229 కోట్లు ఆదాయంలో కోతపడింది. జిల్లాలో అధిక ఆదాయం ఆర్జించే రాజమహేంద్రవరం లక్ష్యానికి రూ.73 కోట్లు దూరంగా ఆగిపోయింది. వేగేశ్వరపురం 50శాతం కూడా చేరుకోలేదు. రిజిస్ట్రేషన్ల ఆదాయం బాగా పడిపోతోందని గతంలోనే 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించడం గమనార్హం. 2023-24 ఏడాది ఎన్నికల సంవత్సరం. వైసీపీ ప్రభుత్వ హయాంలో భూముల పందేరం యథేచ్ఛగా జరిగిన సంగతి తెలిసిందే. వేల ఎకరాల్లో చుక్కల భూములను ఫ్రీహోల్డు చేశారు. వాటిలో చాలా మటుకు వైసీపీ నాయకులే రిజిస్ట్రేషను చేయించుకున్నారని తెలుస్తోంది. చివరి ఏడాది మరీ దారుణంగా భూములపై కోరలు చాచడంతో రిజిస్ట్రేషను శాఖకు బాగా ఆదాయం సమకూరినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఏడాది 78.38 శాతం టార్గెట్ పూర్తి చేసింది.



• ఇవీ లెక్కలు

ఎస్ఆర్‌వో	2023-24 (రూ.కోట్లలో)			2024-25 (రూ.కోట్లలో)		
	లక్ష్యం	రాబడి	డాక్యుమెంట్లు	లక్ష్యం	రాబడి	డాక్యుమెంట్లు
అనపర్తి	20.56	16.05	8302	23.19	17.48	4640
అనంతపల్లి	27.58	20.20	12650	31.66	29.20	9370
బిక్కవోలు	28.07	15.47	12221	26.44	20.63	5692
కడియం	57.44	36.29	14593	59.55	38.46	7929
కోరుకొండ	25.82	19.95	15671	32.03	16.87	6612
కొవ్వూరు	47.72	37.89	22170	57.59	43.54	11954
నిడదవోలు	38.55	28.18	18562	44.88	30.14	9526
పిడింగొయ్యి	70.89	45.59	10905	71.65	51.09	5853
రాజమండ్రి	150.78	149.44	29196	230.34	157.20	17513
రాజానగరం	89.56	67.83	19334	94.21	51.48	10963
సీతానగరం	9.90	6.78	6546	9.82	7.17	3060
వేగేశ్వరపురం	16.46	13.39	9386	20.03	9.45	4579
మొత్తం	583.13	457.06	179536	701.39	472.71	97691

జిల్లాకు 50 ఎలక్ట్రిక్ బస్సులు

రాజమహేంద్రవరం డిపోకి కేటాయింపు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పీఎం ఈ-బస్ సేవా కింద కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించనున్న 750ఎలక్ట్రిక్ బస్సుల్లో జిల్లా ఆర్టీసీకి 50 బస్సులు రానున్నాయని తెలుస్తోంది. ఈమేరకు దీనికి సంబంధించిన సమాచారం ఇప్పటికే ఆర్టీసీ జిల్లా అధికారులకు అందినట్టు తెలిసింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు టెండరు దశలో ఉంది. ఎలక్ట్రిక్ బస్సులకు ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుకోవడం, సాంకేతికతలను సమకూర్చుకోవాల్సి ఉన్నందున ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డు ఎక్కేందుకు మరో పది నెలల నుంచి ఏడాది సమయం పడుతుందని చెబుతున్నారు. తొలిదశలో భాగంగా జిల్లాకు కేటాయించే 50 ఎలక్ట్రిక్ బస్సులను రాజమహేంద్రవరం డిపో నుంచే ఆపరేట్ చేస్తారు. వీటిని ప్రధాన రూట్లలో విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ మార్గాల్లో నడపాలని ఆర్టీసీ అధికారులు ఇప్పటికే అంచనాకు వచ్చారు. వాతావరణంలో కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో కేంద్రం ఈ-బస్ సేవా ప్రోగ్రాంను అమలు చేస్తున్న నేపథ్యంలో దశలవారీగా ఇతర డిపోల్లోనూ ఎలక్ట్రిక్ బస్సులను పెద్ద సంఖ్యలో అందుబాటులోకి తీసుకొస్తారని సమాచారం.


ప్రత్యేక పంచాయతీతోనే సమస్యలు పరిష్కారం

- ఆర్అండ్ఆర్ కాలనీని సందర్శించిన కలెక్టర్
- గుర్తింపు కార్డుల బదిలీ వెంటనే జరగాలి
- అప్పుడే కాలనీవాసులకు తగిన న్యాయం



కృష్ణునిపాలెంలోని ఆర్అండ్ఆర్ కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

గోకవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామ శివారున నివాసం ఉంటున్న ఆర్అండ్ఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆర్అండ్ఆర్ కాలనీలో గత కొంతకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో బుధవారం ఆమె కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిర్వాసితులను నేరుగా కలుసుకొని ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం, ఉపాధి పనులు లేకపోవడం, శ్మశానవాటిక తదితర సమస్యలను ఇక్కడ నివాసం ఉంటున్న 18 పోలవరం నిర్వాసిత గ్రామాలవాసులు కలెక్టర్ దృష్టికి తీసికెళ్లారు. దీంతో జిల్లా కలెక్టర్ స్పందిస్తూ నిర్వాసితులకు చెందిన రేషన్, ఆధార్, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఇప్పటికీ ఏజెన్సీ పరిధిలో ఉండడం, అక్కడ నుంచి ఇక్కడకు ఇంతవరకూ బదిలీ కాకపోవడం వల్ల తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయలేకపోతునామన్నారు. వెంటనే నివాసితులంతా తమ గుర్తింపు కార్డులను గోకవరం మండలంలోకి బదిలీ చేయించుకొని, తద్వారా ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసుకుంటే వెంటనే ప్రభుత్వపరంగా కల్పించాల్సిన మౌలిక సదుపాయాలన్నింటినీ పూర్తి చేస్తామని నిర్వాసితులకు ఆమె హామీ ఇచ్చారు. ఇందుకోసం ఆర్అండ్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న 18 గ్రామాల ప్రజలతో గ్రామసభలు నిర్వహించి అంగీకారం తీసుకోవాల్సిందిగా స్థానిక అధికారులను ఆదేశించారు. నిర్వాసితుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే నెహ్రూ పదేపదే తన దృష్టికి తీసుకురావడంతో తాను ఈ సందర్శనకు వచ్చానని కలెక్టర్ తెలియజేశారు. కార్యక్రమంలో తహశీల్దారు సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డీసీపీవో రీ-నోటిఫికేషన్ వెనుక మతలబు ఏమిటో?

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీవో) నియామకం గురించి జారీచేసిన నోటిఫికేషన్ రద్దుచేసి.. మళ్లీ తాజాగా నోటిఫికేషన్ ప్రకటించడం వెనుక పలు ఆరోపణలు వినవస్తున్నాయి. బాలల సంరక్షణ కోసం జిల్లాకు ఒక అధికారి ఉంటారు. జిల్లా డీసీపీవో రాజ్‌కుమార్ ఈ ఏడాది జనవరిలో మృతి చెందారు. ఆ పోస్టు భర్తీ చేయడం కోసం 15రోజుల తర్వాత నోటిఫికేషన్ ఇచ్చారు. సుమారు 90 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా నియామకాల కమిటీ ఇంటర్వ్యూల ద్వారా పోస్టు భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇటీవల ఆ నోటిఫికేషన్ని రద్దు చేశారు. మంగళవారం రీ-నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నోటిఫికేషన్‌లో పలు సామాజిక వర్గాలకు వయసు సడలింపు ఇచ్చారు. చివరిగా డీసీపీవోల కోసం 2023 డిసెంబరులో ఇంటర్వ్యూలు జరిగాయి. 2024 జనవరిలో నియామక పత్రాలు అందజేశారు. ఆ నోటిఫికేషన్‌లో, ఇప్పుడు రద్దు చేసిన నోటిఫికేషన్‌లో వయసు సడలింపు లేదు. 42 ఏళ్ల వయసులోపు వారు అర్హులు. అయితే వైసీపీ హయాంలో నియమించిన రాష్ట్ర బాలల సంరక్షణ కమిటీలోని వైసీపీ సానుభూతిపరుడైన ఓ సభ్యుడు జిల్లా డీసీపీవో పోస్టుపై కన్నేశారని చెబుతున్నారు. ఆ కమిటీ గడువు ఓ నెలతో ముగుస్తుంది. దీంతో ఆయన వయసు అర్హత పరిధిలోకి రావాలనే ఉద్దేశంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు లేఖ సమర్పించడం ద్వారా 42 ఏళ్లుగా ఉన్న వయసు పరిమితిని 47గా మార్పు చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎంతమంది దరఖాస్తు చేసినా ఆయనకే పోస్టు దక్కేలా పావులు కదుపుతున్నారని చెబుతున్నారు. ఆ స్థానంలో ఇప్పటివరకూ పని చేసిన రాజ్‌కుమార్ కూడా రాజమండ్రి మాజీ ఎంపీ భరత్‌రామ్ అండదండలతో పోస్టు దక్కించుకున్నారని ప్రచారం జరిగింది.

sf | సుందరం హోమ్
సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం: నం. 21, పట్టుల్లోస్ రోడ్, చెన్నై - 600002. ఫోన్: 044-2852 1181.
కార్పొరేట్ కార్యాలయం: "సుందరం టవర్స్", 46, వైట్స్ రోడ్, చెన్నై - 600014.
ఫోన్: 044-2851 5267. ఈ -మెయిల్: corporateaffairs@sundaramhome.in
వెబ్ సైట్: www.sundaramhome.in,
CIN: U65922TN1999PLC042759
సవరణ
సిరికేతన, 1వ అంతస్తు, ఇంటి నం. 86-15-8/1, బ్లాక్ నం. 18, జె. ఎన్. రోడ్, వాద్రేవు నగర్, రాజమండ్రి - 533103 వద్ద గల మా రాజమండ్రి శాఖ డోర్ నం. 76-5-27, గానుగుల వీధి, రాజమండ్రి, గాంధీపురం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 533103 కి 25-02-2025 నుండి వర్తింపుతో బదిలీ చేయబడుతుందని తెలియజేస్తూ 21-11-2024 తేదీ గల మా ప్రచురణ తదుపరిగా ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, పైన తెలిపిన నూతన ఆవరణకు మార్పుట అనునది అనివార్య కారణాల వలన 26-04-2025కు వాయిదా వేయబడినది. మా శాఖ ప్రస్తుత ప్రదేశం లోనే 25-04-2025 వరకు నిర్వహణకు కొనసాగుతుంది.
ప్రదేశం: చెన్నై, తేది: 10-04-2025
సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరఫున
ఆర్. వెంకటసుబ్రమణియన్,
చీఫ్ కాంప్లియన్స్ ఆఫీసర్ & కంపెనీ సెక్రటరీ

మరియమ్మకు ఆర్థిక సాయం అందజేత



సరుకులు అందజేస్తున్న 'మానవతా' సభ్యులు

చాగల్లు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రం (దివ్యాంగుల పాఠశాల)లో ఆయాగా పనిచేస్తున్న టీ. మరియమ్మ కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కారణంగా రూ. 30 వేలు ఆర్థికసాయాన్ని భవిత కేంద్రంలో పని చేసే ఉపాధ్యాయులు బుధవారం అందజేశారు. సమగ్ర శిక్ష జిల్లా అధికారి కనక బాబు చేతులమీదుగా ఈ మొత్తాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు నగపూర్ణిమ, ఎంఈవో కార్యాలయ సిబ్బంది గణేష్, వెంకట్, రాజేష్, రామ చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ విషయం తెలుసుకున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థవారు స్పందించి ఎన్ఆర్ఐ మోతుకూరి కాశీ విశ్వేశ్వరరావు దాతృత్వంతో రెండునెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, కోడి నాగేశ్వర రావు రూ. 500 సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఛైర్మన్ జేప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆళ్ల వీర వెంకట సత్యనారాయణ, శంకర్, కొడవటి రవి, సూరిబాబు, కాశీ, తదితరులు పాల్గొన్నారు.

'అభ్యర్థుల ఎంపికలో డీసీసీ అధ్యక్షుడిదే తుది నిర్ణయం'

పెరవలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు పూర్తి అధికారాలు ఇవ్వడంతోపాటు అభ్యర్థుల ఎంపికలోనూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిదే తుది నిర్ణయమని జాతీయ అధ్యక్షుడు పేర్కొన్నట్టు రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి, తూర్పు గోదావరి జిల్లా పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి పేర్కొన్నారు. అహ్మదాబాద్‌లో జరుగుతున్న జాతీయ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో రెండో రోజు బుధవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్ఠత కోసం జాతీయస్థాయిలో తీసుకుంటున్న నిర్ణయాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. జిల్లా, మండల గ్రామస్థాయిలో పార్టీ బలపడటానికి అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

దేవరపల్లిలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

దేవరపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి మహోత్సవాల్లో భాగంగా స్థానిక మెరక వీధి కోదండ రామాలయం వద్ద బుధవారం సీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంపై ఊరేగించారు. గ్రామ పురవీధుల్లో స్వామి వారికి భక్తులు దర్శించుకున్నారు. కార్యక్ర మంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు , తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ముగిసిన ఏఐ శిక్షణ



ప్రొఫెసర్ శ్రీనివాస చక్రవర్తిని శాలువాతో కప్పి సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్

కొవ్వూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం మొత్తం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై ఆధారపడి ఉందని విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ నెక్కంటి శ్రీనివాస చక్రవర్తి అన్నారు. ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు ఏఐపై నిర్వహిస్తున్న రెండురోజుల వర్క్‌షాప్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శ్రీనివాస చక్రవర్తిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రామ్మోహన్ శాలువాను కప్పి సత్కరించారు. కళాశాల అడ్వయిజర్ ఎన్‌వీ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

37వ డివిజన్‌లో భారీ అన్నదానం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ 37వ డివిజన్ వీరభద్రపురం కోదండరామాలయం వద్ద మాజీకార్పొరేటర్ పెనుగొండ విజయభారతి, పెనుగొండ రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం భారీ అన్నసమారాధన జరిగింది. శ్రీరామనవమి ఉత్సవాలు ముగింపు సందర్భంగా దీన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరయ్యారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు.

మూడు జిల్లాలకు గోదావరి జలాలు

• రూ. 1400 కోట్లతో వాడపల్లి బంగారమ్మపేట వద్ద హెడ్‌వర్క్స్ ఏర్పాటు • ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తూర్పు, పశ్చిమ, ఏలూరు జిల్లాలకు రూ. 1400 కోట్లతో గోదావరి జలాలు శుద్ధి చేసి తాగునీటిని అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వేలోని తప్పులను సరిచేయాలని, అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు మంజూరు చేయాలని, కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు, ఆయా గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇటీవల జడ్పీ నుంచి నిధులు తీసుకువచ్చి అవసరమైన చోట బోర్లు వేయించడం జరుగుతుందన్నారు. పైపు లైను మరమ్మతులు ఉంటే మండల, పంచాయతీ నిధులతో చేపట్టడం జరుగుతుందన్నారు. 2027లో గోదావరి పుష్కరాలకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో డివిజన్‌స్థాయిలో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా మున్సిపాల్టీకి రూ. 50 కోట్లు, గ్రామీణ ప్రాంతాలకు రూ. 110 కోట్లతో గోదావరి ఉపరిజలాలు శుద్ధిచేసి ప్రజలకు తాగునీటిగా అందించడానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకార్ల నారాయుడు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, నాదెళ్ల శ్రీరామ్, సుంకర సత్తిబాబు, ఉప్పులూరి చిరంజీవి, గంటా కృష్ణ, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్ర కుమార్, ఎంపీడీవోలు శ్రీదేవి, రమణ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పవన్ కుమారుడు కోలుకోవాలని పూజలు



పెనకనమెట్టలో పూజలు చేస్తున్న జనసైనికులు

కొవ్వూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్‌శంకర్ త్వరగా కోలుకోవాలని పెనకనమెట్టలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం జనసైనికులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జనసైనికులు అచ్యుతరాయుడు, షైగపుల బాలు, ఎంపీటీసీ పసలపూడి తాతారావు, యాళ్ల నరేంద్ర, తోట నాగేంద్ర పాల్గొన్నారు.

11 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగం సాధించినవారితో అధ్యాపక బృందం

నిడదవోలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం దివిస్ లెబోరేటరీస్ లిమిటెడ్, డైకిన్ ఏసీ కెంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. ఇందులో 18 మంది అభ్యర్థులు పాల్గొనగా, ఏడుగురు దివిస్ లెబోరేటరీస్‌కు... నలుగురు డైకిన్ కెంపెనీకి ఎంపికయ్యారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను అధ్యాపక బృందం అభినందించింది.

ముగిసిన హనుమాన్ చాలీసా పారాయణం



హోమంలో పాల్గొన్న మాజీమంత్రి వనిత

నల్లజర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం నల్లజర్ల శ్రీరామకృష్ణ భక్త మందిరంలో గత 49 రోజులుగా కొనసాగుతున్న సప్త, సప్తాహ హనుమాన్ చాలీసా పారాయణం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి అభిషేకం, ఆకుపూజ, గంగ సింధూరపూజ, నరహోష, శత్రుపీడ, గ్రహపీడ నివారణకు మన్యుపాశుపత మహామంత్ర హోమాన్ని వేదపండితులు బ్రహ్మశ్రీ నందుల ఆంజనేయశర్మ, సాముపేదం నగేష్ శర్మగౌడు మణికంఠ సాయి ఆధ్వర్యంలో జరిగింది. వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం దంపతులు పూజాదికాలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి తానేటి వనిత , తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



దొమ్మేరులో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. దొమ్మేరులో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 11 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, హౌసింగ్ కాలనీలో జీఎస్‌టీ రోడ్డుపనులు ఉన్నాయి. అలాగే ధర్మవరం హౌసింగ్‌కాలనీలో రూ. 12 లక్షలతో, పంగిడిలో రూ. 30 లక్షలు, దేచర్లలో రూ. 10 లక్షలు, నందమూరులో రూ. 12 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు తానేటి కుమారి, నేరేడుమిల్లి నాగమణి, జి. నాగార్జున, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, గారపాటి శ్రీదేవి, యలమర్తి శ్రీరాంప్రసాద్, గారపాటి వెంకట కృష్ణ, కలగర సుబ్బారావు, చౌటిపల్లి శివ, పెరుగు పోతురాజు, కే. విజయకుమార్, పీకే రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం పీహెచ్‌సీలో బుధవారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గైనకాలజిస్ట్ ఆయేషాఖాన్ గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. దీనిలో భాగంగా పీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో ప్రసవించిన తల్లులకు జననీ సురక్ష యోజన పథకంలో భాగంగా వెయ్యి రూపాయలను పోషకాహారం నిమిత్తం వారి అకౌంట్లలో జమచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కేడీవీఎల్ కుమారి, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తల్లి, చెల్లెలపై దాడి .. వ్యక్తిపై కేసు

కొవ్వూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తల్లి, చెల్లెలను కొట్టి దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన జొన్నలగడ్డ సత్యవతి భర్త మరణించడంతో తన కుమారుడు ప్రదీప్‌కి భర్త ఉద్యోగం వచ్చింది.కొంతకాలం వరకు బాగానే ఉన్నప్పటికీ ... ఈనెల 4వ తేదీన ప్రదీప్ తన తల్లిని పింఛన్ డబ్బులు ఇవ్వమని కొడుతుండగా, విషయం తెలుసుకున్న అతని చెల్లెలు ప్రియదర్శిని అడ్డువచ్చింది. దీంతో ఆమెపైనా దాడి చేశాడు. ఈ మేరకు ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపంగా శాంతి ర్యాలీ



పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సిట్ దర్యాప్తు వేగవంతం చేసి అనుమానాలను నివృత్తి చేయాలని పాస్టర్ సవరపు అడ్వర్డ్ అన్నారు. బుధవారం కొవ్వూరు మెరకవీధి అంబేద్కర్ విగ్రహం నుంచి నియోజకవర్గ పాస్టర్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో డా. రాణీసుస్మితకు ప్రవీణ్ పగడాల మృతి ముందు, వెనుక జరిగిన సంఘటనలతో మాకు చాలా అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. పాస్టర్ సవరపు అడ్వర్డ్ మాట్లాడుతూ సంఘటన జరిగిన నాటి నుంచి ఇప్పటి వరకు మీడియా దర్యాప్తు వేగంగా జరుగుతుందని, కానీ పోలీసు దర్యాప్తు ఆశించినంత వేగంగా జరగడం లేదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పాస్టర్ల ఐక్యవేదిక నాయకులు ఏకే ప్రసాద్‌బాబు, ఏ. సాక్షిబాబు, ఫిలిప్‌కుమార్, ఎల్. బుజ్జిబాబు, జీవరత్నం, ఎం. బుజ్జిబాబు, వీ. నాని, జాన్ బాబు, హిజ్కీయారాజు, పీ. రమేష్‌బాబు, వై. నిరీక్షణరావు, క్రైస్తవ సంఘాల సేవకులు, అధిక సంఖ్యలో విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపర్రులో గర్భిణులకు అవగాహన సదస్సు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, తల్లులు, కిశోర్ బాలికలకు అవగాహన సదస్సును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తల్లి బిడ్డల ఆరోగ్యం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాలు మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 22వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, కిశోర్‌బాలికలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు సహకరించాలి



ఇన్సూరెన్స్ న్యాయవాదుల సమావేశంలో అదనపు జిల్లా జడ్జి అనురాధ

కొవ్వూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌కు న్యాయవాదులు సహకరించాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ అన్నారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో ఇన్సూరెన్స్ న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చేనెల 10వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా న్యాయవాదులు సహకరించాలన్నారు. సమావేశంలో ఉప్పల కృష్ణారావు, యాగంటి చలపతి, తాడేపల్లి ప్రభాకర్, కె. నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో పంటలకు తీవ్ర నష్టం



కరగపాడులో నేలకొరిగిన మొక్కజొన్న పంట

గోపాలపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా గత రెండురోజులుగా వీస్తున్న ఈదురుగాలులకు మండలంలో 262 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగినట్టు ఏవో బీ. రాజారావు తెలిపారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో 5 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతుందన్నారు. ప్రస్తుతం గింజ గట్టిపడే సమయంలో ఈదురు గాలుల ప్రభావంతో నేల రాలటం వల్ల గింజలు చచ్చుబడి దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రాథమిక అంచనాల అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నామన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన అనంతరం రైతుల పంట నష్టశాతాన్ని అంచనా వేయడం జరుగుతుందన్నారు.

దేవరపల్లి: మండలంలో గాలితో కూడిన వాన కురవడంతో అరటి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే ధాన్యం, మిర్చికల్లాలు తడిచి ముద్దయ్యాయి. పల్లంట్ల, కురుకూరు, కృష్ణంపాలెంలో సుమారు 35 ఎకరాల్లో అరటి పంటకు నష్టం వాటిల్లింది. ఉద్యానశాఖ అధికారులు వచ్చి నష్టపోయిన రైతుల వివరాలను సేకరిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ గాలులు వీయడంతో నష్టపోయామనరి రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే త్యాజంపూడి, కృష్ణంపాలెం, దుద్దుకూరు, గౌరీపట్నంలో రైతులు ధాన్యాన్ని జాతీయ రహదారికి ఇరువైలా ఆరబెట్టారు.

పెరవలి: ప్రస్తుత వాతావరణం దృష్ట్యా అన్నదాత గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.



తీపర్రు వద్ద ధాన్యంపై బరకాలు కప్పుతున్న రైతులు

గత నాలుగు రోజులుగా ఇదేవిధంగా పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికే మండలంలోని కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు గ్రామాల పరిధిలో వరికోతలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి కూడా కొద్దిపాటి వర్షం కూడా కురిసింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వారంతా ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షం కురిస్తే పోసిన ధాన్యం రాశులు తడిచిపోవడంతోపాటు కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు కూడా నేలవాలిపోతాయని వాపోతున్నారు. దీంతో రైతులంతా బరకాలు సిద్ధం చేసుకుని రోడ్లపై ఎక్కడికక్కడ రాశులను కప్పి జాగ్రత్తపడుతున్నారు.



కురుకూరులో నేలమట్టమైన అరటితోట

దారుణం

• బాలబాలికలను లైంగికంగా వేధిస్తున్న వృద్ధుడు
• తల్లిదండ్రుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు
• పోక్సో నమోదు.. పోలీసుల అదుపులో నిందితుడు

నల్లజర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అసలే వృద్ధుడు.. పైగా హెచ్ఐవీ బాధితుడు. ముక్కుపచ్చలారని ఐడి పిల్లలపై లైంగిక చర్యలతో వేధించాడు. చాక్లెట్లు, బిస్కెట్లు ఎరచూపి వారితో జుగుప్సాకరమైన రీతిలో ప్రవర్తించాడు. విషయం బయటకు రావడంతో పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు. మండలంలోని ఓ గ్రామంలో అరవై ఏళ్ల వృద్ధుడికి హెచ్ఐవీ ఉంది. పాఠశాలలో నాలుగైదు తరగతులు చదువుకుంటున్న బాలబాలికలు పాఠశాల విడిచిన తర్వాత పక్కనే ఖాళీ స్థలంలో ఆడుకునేవారు. వారి తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లేవారు కావడంతో వారు వచ్చేదాకా అక్కడే పిల్లలంతా కాలక్షేపం చేసేవారు. ఇదే అదనుగా నిందితుడు అక్కడి పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చి మచ్చిక చేసుకుని సమీపంలోని ఆయిల్‌పామ్ తోటలోకి తీసుకెళ్లేవాడు. ఏడు ఎనిమిదేళ్ల వయసున్న ముగ్గురు బాలురు, ఐదుగురు బాలికలను మభ్యపెట్టి తోటలో అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఇది గత నెల రోజులుగా జరుగుతున్నా... వారంతా భయంతో ఎక్కడా నోరు విప్పలేదు. కానీ బాలికలతోపాటు కొంతమంది బాలురుని కూడా తీసుకెళ్లడంతో ఆ విష యం ఒక బాలుడు తన తల్లికి చెప్పాడు. కానీ పిల్లల కుటుంబాల పరువుపోతుం దేమోనని ఎవరూ ఈ విషయాన్ని బహిర్గతం చేయడానికి ముందుకు రాలేదు. ఇటీవల ఆ కాలనీలో ఒక బాల్యవివాహం ఆపడానికి ఐసీడీయస్ సిబ్బంది వెళ్లడంతో ఆ ప్రాంత ఆశ కార్యకర్త ఈ విషయాన్ని వారితో ప్రస్తావించారు. చివరకు మంగళవారం ఐదుగురు తల్లులు తమ పిల్లలను తీసుకుని ఐసీడీయస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి సహాయంతో సీఐ రాంబాబుకు ఫిర్యాదు చేశారు. ఆయన తల్లులను, పిల్లలను విడివిడిగా జరిగిన విషయం గురించి అడిగి తెలుసుకున్నారు. బుధవారం తొమ్మిది మంది బాలబాలికలకు వైద్యపరీక్షలు చేయించారు. రిపోర్టు రావాల్సి ఉంది. నిందితుడిపై పోక్సో కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నట్టు సీఐ పేర్కొన్నారు. చివరికి రిపోర్టులు వస్తే గానీ చిన్నారులకు హెచ్ఐవీ సోకింది లేనిది తెలీదు.

క్రైస్తవులు ఐక్యంగా ఉండాలి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

గోపాలపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులంతా ఐక్యంగా ఉండాలని గోపాలపురం మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ జీ.పాల్‌రాజ్ అన్నారు. నందిగూడెంలో తలారి తిమోతి దేవాలయంలో బుధవారం ఫెలోషిప్ కార్యదర్శి నిరీక్షన్ నిర్మలకుమార్ అధ్యక్షతన మండల పాస్టర్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాల్‌రాజ్ మాట్లాడుతూ క్రైస్తవులంతా ఐక్యంగా ఉంటే ఎటువంటి శక్తులు దాడి చేయలేవన్నారు. లౌకికవాదంతో ఉన్న ప్రజాస్వామ్య భారతదేశంలో క్రైస్తవులంతా హక్కులను కాపాడుకోవడానికి పాటుపడాలన్నారు. చర్చిల్లో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పాస్టర్స్ ఫెలోషిప్ దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలో ఉన్న పాస్టర్లకు తన సొంత నిధులతో బీమా పథకం కట్టేందుకు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు భరోసా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో పాస్టర్ రవికుమార్, ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు బెన్‌హమ్, శామ్యూల్‌రాజ్, కరుణాకరరావు, తానేటి రాజు, జాన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

270 కిలోల గంజాయి స్వాధీనం

• హరియాణా వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఎస్పీ నరసింహ కిషోర్ ఈ మేరకు వివరాలను వెల్లడించారు. హరియాణాలోని సోనిపట్ గ్రామానికి చెందిన మోను సైనీ లారీ డ్రైవరుగా పని చేస్తున్నాడు. ఎస్ఎల్ 01 ఏజే 6162 నెంబరు కలిగిన కంటెయినర్ లారీలో విశాఖపట్నానికి ఫైవుడ్ లోడు వేసుకొని వచ్చాడు. తిరుగు ప్రయాణంలో నర్సీపట్నం ప్రాంతం నుంచి మరో వ్యక్తి అందజేసిన గంజాయి ప్యాకెట్లను డ్రైవరు క్యాబిన్‌పైన ఉన్న మరో క్యాబిన్‌లో వేసుకున్నాడు. ఈగల్ బృందానికి వచ్చిన సమాచారంతో బొమ్మూరు పోలీసులను అప్రమత్తం చేశారు. బుధవారం ఉదయం 7గంటలకు సీఐ పి.కాశీ విశ్వనాథం నేతృత్వంలో వాహన తనిఖీలు చేపట్టారు. సదరు లారీని ఆపి తనిఖీలు చేయగా గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం రూ.13.50లక్షలు విలువ చేసే 270కిలోల గంజాయి, లారీని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. లారీలోని అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి సందీప్ శర్మ గురించి గాలిస్తున్నామన్నారు. గంజాయి నిర్మూలనలో ప్రజల సహకారం కూడా చాలా అవసరమన్నారు. యువత జీవితాలను నిర్వీర్యం చేస్తున్న గంజాయిని అరికట్టడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తెరగాలన్నారు. గంజాయికి సంబంధించి ఎలాంటి సమాచారాన్నయినా పోలీసులకు తెలియజేయాలని, 112కి ఫోన్‌లో కూడా సమాచారం అందించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. అలాంటి వారి వివరాలను అవసరమైతే గోప్యంగా ఉంచుతామని, రివార్డు అందిస్తామని తెలిపారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య, సీఐ కాశీ విశ్వనాథం, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

నిడదవోలులో దొంగ అరెస్ట్

• రూ. 3.70 లక్షల సొత్తు స్వాధీనం

నిడదవోలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని అరెస్ట్ చేసి బంగారం, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు భీమవరం రైల్వేసర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమరాజు తెలిపారు. నిడదవోలు రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న శింగవరం గ్రామానికి చెందిన ఉలవల పూడి దుర్గారావును బుధవారం ఉదయం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అనుమానాస్పంగా సంచరిస్తుంటే అరెస్ట్ చేశామన్నారు. అతడిని విచారించగా వివిధ కేసులకు సంబంధించి 30 గ్రాముల బంగారం, 18 సెల్ ఫోన్లు, సుమారు, రూ. 3 లక్షల 70 వేలు విలువైన సొత్తు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎస్సై అప్పారావు ఉన్నారు.

గజ్జరంలో రేపటి నుంచి భూ రీసర్వే

తాళ్లపూడి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గజ్జరంలో శుక్రవారం నుంచి భూరీసర్వేను ప్రారంభిస్తున్నట్టు ఇన్‌చార్జి తహశీల్ధార్ మెహనభారతి తెలిపారు. గజ్జరం సచివాలయం వద్ద బుధవారం సర్పంచ్ గండి రాంబాబు ఆధ్వర్యంలో భూసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహశీల్ధార్ భారతి, డీఎస్ఎల్‌వో లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో రీ సర్వే అధికారులు డీఐ వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ సత్యనారాయణ, వీఆర్‌వోలు, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.